ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

జూన్ 4, 2006

వానజల్లు

హ్యాపీ బర్త్ డే

(4.6.2006 నుండి 10.6.2006 వరకు)

ప్రభాత్
2సం॥, జూన్-6
నిర్మల-హరికిషోర్
హైదరాబాద్

జి. సుహాస్
4సం॥, జూన్-6
సుకన్య-రామకిషోర్
అమెరికా (యు.ఎస్.ఎ)

బి. సృజన
2సం॥,జూన్-6
రామలక్ష్మి-శ్రీనివాస్
గాంధినగర్-తూ॥గో॥

ఎల్. మానస
3సం॥,జూన్-6
లక్ష్మికాంత-మారయ్య
అయ్యన్నపేట-విజయనగరం

మానవి
3సం॥, జూన్-7
శ్రీలత-మధుసూదనరావు
తోటపాలెం-విజయనగరం

కె. జయంత్
1సం॥, జున్-2005
సునీత-కోటేశ్వరరావు
రావినూతల-ప్రకాశం

కార్తికేయ
1సం॥, జూన్-8
పద్మ-శ్రీనివాస్
రాజాం-శ్రీకాకుళం

పృథ్వి
జూన్-4
సరిత-శ్రీనివాసాచారి
సంపత్‌నగర్-ఖమ్మం

అభిషేక్
జూన్-6
లక్ష్మికాంత-వెంకటరమణ
జక్కపల్లి-ఖమ్మం

పి. చింటూ
1సం॥, జూన్-2005
నాగమణి-వెంకన్న
జంగారెడ్డిగూడెం-ప॥గో॥

వై. జయరాం మోహన్‌జీ
9సం॥, జూన్-1997
మాధురి-రమేష్
విద్యానగర్-గుంటూరు

సృజన
4సం॥, జూన్-2002
నీరజ-చంద్రశేఖర్
శంకర్‌పల్లి

బి. తేజశ్విని
2సం॥, జూన్-2004
హైమావతి-రవి
గూడుర్-నెల్లూర్

కె. మౌనిక
2సం॥, జూన్-2004
అనూరాధ-నాగమల్లేశ్వరరావు
చందోలు-గుంటూరు



సంకల్పం మంచిదైతే...

సంఘానికి ఉపయోగపడాలనే తలంపుండాలి. తపనుండాలి. సమాజంలో నానాటికీ సేవాభావం కొరవడుతోంది. నైతిక విలువలు నానాటికీ దిగజారుతున్నాయి. చేసే ప్రతిపనికీ ప్రతిఫలాన్ని ఆశించడం ఆనవాయితీగా మారింది. నేను ప్రధానంగా విద్యారంగానికి చెందినవాడిని. రచయితను. ఈనాడు అధ్యాపక వర్గాల్లో అధ్యయనంకోసం తీవ్రమైన కృషి కొరవడింది. విద్యార్థులకు మార్గదర్శకులైన అధ్యాపకులు అధ్యయనంపట్ల చాలామంది విముఖత ప్రదర్శిస్తున్నారు. తెలుగుకోసం, తెలుగు భాషా సాహిత్య వికాసంకోసం సిపి బ్రౌన్ నాడు దొరలపాలనలోనే సంకల్పించాడు. ఒక ఆంగ్లేయుడు తెలుగుకోసం కడపను కేంద్రంగా చేసుకుని పడిన తపన నన్నాకర్షించింది. ఆయన పేరు ప్రపంచవ్యాప్తంగా చాటే అవకాశం పెద్దలు నాకు అప్పజెప్పారు. ఏమాత్రం ఆర్థిక సాయంలేని స్థితిలో పాడుపడిన, శిథిలావస్థలో ఉన్న బ్రౌన్ నివాస స్థలాన్ని నాకు చూపించారు. సమాజానికి మేలు చేయాలనే తలంపుతో ముందుకు సాగాను. జిల్లాకు వచ్చిన కలెక్టర్లూ, ఎందరో ప్రజాప్రతినిధులూ మంచి చేస్తున్నావంటూ ప్రోత్సహించారు. ముందుకు నడిపించారు. పాడుబడిన గోడల నుంచి అక్కడో మహాసౌధాన్ని నిర్మించే విధంగా సమాజం నాకు సహకరించింది. అందుకే సమాజాన్నెప్పుడూ చెడ్డగా భావించకూడదు. సంకల్పం మంచిదైనపుడు సమాజం మనకు తప్పక సహకరిస్తుంది. ఇది నా జీవితానుభవం.

జానమద్ది హనుమచ్ఛాస్త్రి

మన అతిథి గురించి...

పేరు	:	జానుమద్ది హనుమచ్ఛాస్త్రి
పుట్టినతేది	:	5-9-1952
విద్య	:	తెలుగు, ఇంగ్లీషుల్లో ఎం.ఏ.
రచనలు	:	ప్రముఖ తెలుగు, కన్నడ, ఆంగ్ల - దిన, వార పత్రికల్లో 2500కు పైగా వ్యాసాల రచన మాసీమ కవులు, బళ్ళారి రాఘవ జీవిత చరిత్ర వంటి 20 గ్రంథాలు.

ఈ సంచికలో...

టపా ... 2
టర్నింగ్ పాయింట్ ... 4
సలహాలు ... 5
ఇంటి సంగతులు ... 6
క్యాంపస్ ఛాట్ ... 10
సినిమా కబుర్లు ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14
మనమూ మన నమ్మకాలు... 20



ఇలా వుందామా... 7
ప్రోత్సాహం

సీరియల్ 8
తెలుగుగడ్డ

కథ 18
పావు

ఇంకా...

ఆరోగ్యం ... 17
ఓ మంచి పుస్తకం ... 21
మనసా... తెలుసా ... 22
అవీ... ఇవీ ... 23
కొత్త పుస్తకాలు ... 24



పోటీ

కవర్ స్టోరీ 'బుధియా వివాదంలోకి పరుగు' తోబాటు సంచికలో వచ్చిన మిగతా విషయాలన్నీ కూడా ఒకదాన్ని మించి ఒకటి పోటీపడేలా ఉన్నాయి. ఇవి పాఠకలోకానికి ఆనందాన్ని అందిస్తూనే ఆలోచింపచేసేలా వున్నాయి. పోతే ఈ సంచికలో ఆరోగ్యం పేరుతో ఇచ్చిన చిరంజీవి కల్పన బాగుంది. బ్రెయిన్‌డెత్ బారిన పడిన కూతురి మూత్రపిండాలు, కళ్ళు ఇతరులకు దానం ఇచ్చిన కథనం అవయవదానాన్ని ప్రోత్సహించేదిగా, ఆ దిశగా ఆలోచనలు రేకెత్తించేవిధంగా వుంది.

సిరిపురం రామకోటేశ్వరరావు, ఎనికేపాడు



జన్మ సార్థకం

స్నేహలోని శీర్షికలన్నీ బాగుంటున్నాయి. ఆరోగ్యం శీర్షికలో తెలియజేస్తున్న విషయాలు హృదయం ద్రవించేలా ఉంటున్నాయి. చిన్న వయసులోనే బ్రెయిన్‌డెత్‌కు గురయినప్పటికీ పెద్ద మనసుతో వారి అవయవాలను ప్రాణాపాయంలో ఉన్నవారికి డొనేట్ చేయడం అనేది మామూలు విషయం కాదు. నిజంగా వారి జన్మ సార్థకమైనట్లే. ఈ శీర్షిక ద్వారా ఇలాంటివారిని పరిచయం చేస్తున్నందుకు స్నేహకు కృతజ్ఞతలు.

ఎం. ఉష, ఎం. సునీత,
కొత్తగూడెం.

సహజనటి

నాలుగేళ్ళ బుడతడు బుధియా ఏడుగంటల్లో 65 కిలో మీటర్లు పరుగెత్తిన అంశం వివాదగ్రస్తం కావడం విచారకరం. వ్యవస్థాపరమైన పద్ధతిద్వారా అతన్ని పరుగుల యోధుణ్ణి చేయాలి. కె.జి. కన్నాభిరాన్ మా నెల్లూరీయుడు కావడం మా అదృష్టం. మొదటి బాలికల పాఠశాల స్థాపించిన జ్యోతిబాపూలే ధన్యుడు. నటి కనకం ఎన్నో రకాల పాత్రల్లో నటించారు. ఆవిడను సహజనటి అనొచ్చు. చిన్నారి చిత్రాలు బాగుంటున్నాయి. మనమూ మన నమ్మకాలు శీర్షికలో ఇచ్చిన ఆర్టికల్ 'రాళ్ళూ రత్నాలు' బాగుంది.

వాస్తురామచంద్ర, రామ్‌జీనగర్,
నెల్లూరు.

హర్షణీయం

'బుధియా' గురించిన కథనం ఆసక్తికరంగా ఉంది. ఒక పక్క రికార్డులతో వెలుగొందుతున్నందుకు ఆనందం కలిగినా వచ్చిన వివాదాల కారణంగా బుధియా ఆరోగ్యం ఎక్కడ పాడవుతుందోనని ఆందోళనగా ఉంది. టర్నింగ్ పాయింట్ బావుంది. కార్టూన్ల సంఖ్య పెంచటం హర్షణీయం. అవీ...ఇవీ శీర్షిక లేకుండా చేశారెందుకో?!

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

చర్య

బుధియాపై వచ్చిన కవర్‌స్టోరీ ఆసాంతం పరుగులుపెడ్తూ చదివించింది. ఆ బాబును చూస్తే సంతోషం కలగడంలేదు, గుండె చెరువౌతోంది. భారతప్రభుత్వం బుధియా కోచ్‌పై గట్టి చర్య తీసుకోవాలని కోరుతున్నాం.

శాకమూరి అపర్ణ, విజయవాడ.

ఉపన్యాసం

'ఇంటికంటే హాస్టల్ బెటర్' బాగానేవుంది. సంభాషణల నిడివి కొంత తగ్గించినట్లయితే బాగుండేది. ఇలా అయితే ఉపన్యాసం దంచుతున్న భావన కలుగుతుంది.

ఎన్. భార్గవి, కరీంనగర్.

సజీవం

ఇంటింటా ఫోననేది నిన్నమొన్నటి మాట. ఇపుడు ఇంటికి రెండు మూడు ఫోన్లుంటున్నాయి. అయినా చాలామందికి ఫోనెలా మాట్లాడాలో తెలీకుండా వుంది. ఈ నేపథ్యంలో వచ్చిన 'ప్రహసనం' చక్కగా వుంది. 'తెలుగుగడ్డ' సీరియల్లో నస్పెన్సేమీ లేక పోయినప్పటికీ అందులోని పాత్రలు సజీవంగా వున్నాయి.

కె. హరి,
నెల్లూరు.

ఆలోచించండి...

'హ్యాపీ బర్త్‌డే', 'కలంస్నేహం' శీర్షికల స్థానంలో మరేదైనా మంచి శీర్షికలను ప్రవేశపెడితే బాగుంటుంది. వాటివల్ల అందులో ఫొటో వచ్చిన చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు తప్ప ఇతరులకు రవంత ఆసక్తి వుండదు. ఈ విషయమై ఒకసారి ఆలోచించండి.

మొలకలపల్లి కోటేశ్వరరావు, పమిడిపాడు.

పసందుగా...

'రుచి' పేజీలో ఇచ్చిన వాటర్‌మిలన్ జ్యూస్, తోటకూర వరోటా చూడగానే ఊరించేలా వున్నాయి. పుచ్చకాయ ముక్కలను అమర్చినతీరు భలే పసందుగా వుంది.

లక్ష్మీమల్లీశ్వరి,
కాకినాడ.

ఆకట్టుకున్నాయి...

టర్నింగ్ పాయింట్‌లో జ్యోతిబాపూలే గురించి రామకృష్ణగారు తెల్పిన విషయాలు మమ్మల్ని ఆకట్టుకున్నాయి. మాకు ఇంతకుముందు పూలే గురించి కొన్ని విషయాలు మాత్రమే తెలుసు కానీ ఈ వారం 'స్నేహ'లో చాలా విషయాలు తెలుసుకున్నాం. శూద్రులకు, దళితులకు, వితంతువులకు కొన్ని వందల సంవత్సరాల కిందటే ప్రత్యేక పాఠశాలలు నెలకొల్పి చదువు చెప్పిన ఘనత పూలేది. **జానపాటి శ్రీనివాస్**, సంతోషనగర్, మిర్యాలగూడ.

రూ.510/-ల ఇంగ్లీష్ కోర్సు రూ.150/-కే

లేటెస్ట్ టెక్నాలజీ సహాయంతో

మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	
రూ.130/-	రూ.170/-	రూ.210/-	రూ.510/-

రూ.150/-కే

ఇవన్నీ!

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు తాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!...

నేను ఒకసారి రైలులో ప్రయాణిస్తున్నాను. నా ప్రక్క సీటులోని వ్యక్తి స్టూడెంట్స్ ఇంగ్లీష్ ఇన్‌స్టిట్యూట్ వారి పుస్తకాలు చదువుతున్నాడు. నేను టైంపాస్ కొరకు ఒక బుక్ తీసుకొని చదివాను. అంతే! నాకు ఆశ్చర్యంవేసింది. "ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!..." అనిపించింది. నేను పుస్తకాలు తెప్పించుకుని చదివి ప్రస్తుతం నేను చక్కగా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నాను.

- కె.కమలాకరరావు, విజయవాడ.

ఇదొక డిఫరెంట్ కోర్స్!

డిగ్రీవరకు చదివిన నేను ఇంగ్లీష్‌లో మాట్లాడలేకపోయేవాడిని. నా మిత్రుని వద్ద ఈకోర్స్ బుక్స్ చూశాను. ఇంగ్లీష్ ఫ్లూయెన్సీకి కరక్ట్‌గా ఉపయోగపడే బుక్స్ యివి. 'ఇదొక డిఫరెంట్ కోర్స్' అని నాకు అనిపించింది.

- వి.కె. రాజు, రాజమండ్రి.

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్థమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది.

-కె.సురేష్, హైదరాబాద్.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు.

- వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్పే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు. ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను.

- జె.శ్రీనివాసులు, తిరుపతి.

STUDENTS' ENGLISH INSTITUTE

POST BAG NO.8569, New No. 203, Habibullah Road, (Near: KodambakkamRly. Stn;) T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు కేవలం రూ.150/-లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

3728

Name: ....

Address: ....

....

....

.... Pincode

టర్నింగ్ పాయింట్

వకుళాభరణం రామకృష్ణ

మానవాళి చరిత్రను మార్చిన మానిఫెస్టో



'ఇంతవరకు తత్వవేత్తలు ప్రపంచాన్ని గురించి మానవ సమాజాన్ని గురించి వివరిస్తూ, వ్యాఖ్యానిస్తూ వచ్చారు. కానీ ఇప్పుడు కావాల్సింది ప్రపంచాన్ని మార్చడం' ఈ మాటలు మార్క్సిస్టు సిద్ధాంతకర్త కారల్‌మార్క్స్, దాదాపు ఒకటిన్నర శతాబ్దం క్రితం చెప్పినవి. మానవజాతి చరిత్ర సమస్తం వర్గపోరాటాల చరిత్రేనని చెప్పి, వర్గ రహిత సమాజం, ఆర్థిక, సామాజిక సమానతల పునాదిగా ఏర్పడుతుందని గాఢంగా నమ్మాడు. నమ్మడమే గాకుండా, ఆదర్శ కమ్యూనిస్టు సమాజంకోసం విప్లవాలు అవసరమని ఆ దిశలో కృషి సల్పిన శ్రామికవర్గ పక్షపాతి కారల్‌మార్క్స్. తాను కన్న కలలు పండి, వాస్తవమయ్యేదాకా జీవించకపోయినా, ఆ తర్వాత వచ్చిన లెనిన్ మహాశయుడు మార్క్సిస్టు సిద్ధాంతాన్ని పెంపొందించి, మరింత ముందుకు తీసుకెళ్ళి, రష్యాలో బోల్షివిక్ విప్లవాన్ని సాధించి, ప్రపంచంలో మొట్టమొదటి కష్టజీవుల రాజ్యాన్నే ఏర్పర్చాడు.

మార్క్సిస్టు సిద్ధాంతాన్ని సవివరంగా తెలియచెప్పిన గ్రంథం కమ్యూనిస్టు మానిఫెస్టో, దీన్ని కారల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ కలిసి రాశారు. ఈ గ్రంథం 1848లో వెలువడింది. ఈ గ్రంథప్రచురణ మానవాళి చరిత్రలోనే అపూర్వ ఘటనగా ప్రపంచంలోని తత్వవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలూ ముక్తకంఠంతో పేర్కొన్నారు. మత గ్రంథాలైన ఖురాన్, బైబిల్ కంటే కూడా దీని ప్రాచుర్యం యెన్నదగిందిగా విజ్ఞులు భావిస్తున్నారు. ఇంతకీ ఈ గ్రంథంలో వుంది 33 పుటలే! అయినా, అచ్చుయంత్రం కనుగొన్నాక ప్రచురించిన గ్రంథాలన్నింటికంటే, కమ్యూనిస్టు మానిఫెస్టో కొన్ని వందల ముద్రణలకు నోచుకుంది. ఎన్నో మిలియన్ల కాపీలు అమ్ముడుపోయాయి.

పారిశ్రామిక విప్లవం ఊపందుకుని, పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతున్న దశలో, కార్మికవర్గం తలెత్తింది. ఇది క్రమేపీ బలపడుతూ వచ్చింది. పెట్టుబడిదారీ విధానం ఫలితంగా పుట్టుకొచ్చిన శ్రామికవర్గమే, పెట్టుబడిదారీ విధానానికి గీతం పాడుతుందనీ, ఆ తర్వాతే శ్రామిక రాజ్యం ఏర్పడుతుందనీ కమ్యూనిస్టు మానిఫెస్టో నొక్కివక్కాణించింది. మార్క్సిజం పిడివాదం కాదు. అది కేవలం సిద్ధాంతమో, భావజాలమోకాదు, సమాజగతిని మార్చడానికుపకరించే సైద్ధాంతిక పునాదికలది. శాస్త్రీయమైన అధ్యయనం ద్వారా, చరిత్ర గమనానికి నిక్షిప్తంగా దోహదంచేసే చోదక శక్తులను పరిశీలించడం ద్వారా కనుగొన్న సిద్ధాంతం అది. అభివృద్ధి చెందుతున్న ఉత్పత్తిశక్తులకు, కాలం చెల్లిపోయిన ఉత్పత్తి సంబంధాలకు మధ్య తలెత్తే ఘర్షణ కారణంగా ఉత్పత్తి శక్తుల అభివృద్ధి కుంటుపడుతుంది. దీంతో ఉత్పత్తి విధానంలో మార్పులు సంభవిస్తాయి. మార్పులు జరిగినప్పుడల్లా సమాజం మారుతూ, ఒక దశ నుండి అంతకంటే ఉన్నతమైన మరో దశకు పరిణామం చెందుతూ వస్తుంది. ఈ అంశాన్ని మార్క్స్, ఎంగెల్స్‌లు మానిఫెస్టోలో క్లుప్తంగానే అయినా సూటిగా పదునైన పదజాలంతో వివరించారు. గతి తర్కాన్ని, చారిత్రక భౌతికవాదంతో మేళవించి, రెండు భిన్నమైన వైరుధ్యాల ఘర్షణలో చరిత్ర పురోగమిస్తుందంటారు. దీన్నే శ్రీశ్రీ 'పరస్పరం సంఘర్షించిన శక్తులతో చరిత్ర పుట్టెను'

అని 'దేశ చరిత్రలు' అనే గేయంలో రాశాడు.

జర్మనీలో పుట్టి పెరిగిన కారల్‌మార్క్స్, 1848-49లో జర్మనీలో జరిగిన మహావిప్లవంలో ముందు నిలబడి పోరాడాడు. 1849లో జర్మనీ నుండి బహిష్కృతుడై, తుదకు ఇంగ్లండ్‌లో శాశ్వతంగా స్థిరపడ్డాడు. ప్రథమ ఇంటర్నేషన్‌ను (1864) స్థాపించడంలో తీవ్ర కృషి సల్పాడు. ప్రపంచం నలుమూలల్లో జరుగుతున్న శ్రామికవర్గ పోరాటాలను శ్రద్ధగా గమనించేవాడు. భారతదేశంలోని ఆంగ్లేయపాలనపై సునిశితవ్యాఖ్యానాలు చేశాడు. 1857 తిరుగుబాటును గూర్చి లోతుగా విశ్లేషించాడు. రాజకీయార్థికశాస్త్ర సంబంధమైన ఉద్‌గ్రంథం 'కాపిటల్' మూడు సంపుటాలు రచించాడు. 19-20 శతాబ్దాల్లో జరిగిన శాస్త్రీయాభివృద్ధి, దాన్ని ఆచరణలో పెట్టిన తీరు, మార్క్సిస్టు సిద్ధాంతాన్ని బలపర్చింది. రుజువు చేసింది. ఆచరణ వున్నప్పుడే సిద్ధాంతానికి యోగ్యత, ఫలశ్రుతి అని నమ్మాడు. కమ్యూనిస్టు మానిఫెస్టో మానవుల ఆలోచనా విధానంలో మార్పుకు దోహదంచేసి, ఈనాటికీ అది సజీవంగా నిలిచివుంది.

*

ప్రలోభ పెట్టి...

మా మిత్రుడి సమస్యను మీ దృష్టికి తెస్తున్నాను. అతను ప్రభుత్వ ఉద్యోగి, డబ్బు లావాదేవీలు తెలియవు. శ్రీరామ్ చిట్స్ ఏజంట్ ఒకతను వేధించి, ప్రలోభపెట్టి (అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని) అతని శక్తికి మించిన చిట్స్ 25,000 రూపాయలు, 1,00,000 రూపాయలు, 2,00,000 రూపాయలు, 5,00,000 రూపాయలు మొత్తం 4 చిట్స్‌లో చేర్పించారు. అంటే నెలకు సుమారు 16,000 రూపాయలు చెల్లించాలి.

చిట్టీ ఎత్తుకున్న డబ్బుతో బిజినెస్ చేయించారు. మొత్తం నష్టం - జీతం పదివేలు, పేమెంట్ పదహారువేలు. ఇంతకాలం అప్పులుచేసి డబ్బు చెల్లించారు. చిట్స్ నిబంధనల ప్రకారం పేయింగ్ కెపాసిటి నిబట్టి చిట్స్ వేయించుకోవాలి. కానీ అంతకుమించి వేయించుకున్నారు, ఇతను వేశారు. ఇరువైపులా పొరపాటు జరిగింది. అతనికి, గ్యారంటర్లకు నోటీస్‌లు ఇచ్చారు. నేను కూడా ఒక గ్యారంటర్‌గా ఉన్నాను. గ్యారంటీర్ల జోలికి వెళ్ళకుండా, తన శాలరీ కెపాసిటీలో చెల్లించమని కోరవచ్చా?

బి. శ్రీనివాసులు, వనపర్తి

జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది

శ్రీరామ్ చిట్స్ నిబంధనల ప్రకారం ఒకసారి చిట్టీ ఎత్తాకే గతంలో ఇంకేమైనా బిల్లు లేకుండా జోనల్ ఆఫీసుకు పంపించి పరిశీలించాకే రెండవసారి చిట్ అమౌంట్ ఇస్తారు. కాని ఇతని విషయంలో చిట్‌ఫండ్ వారు లాలూచి పడి ఉండవచ్చు. లేదా అతడి పేరు మీద, అతడి కుటుంబ సభ్యుల పేరు మీద చిట్ ఉండవచ్చు. వారి ఆఫీసు కెళ్ళి విషయం తెలుసుకోండి. సదరు కంపెనీ అధికారులకు ఫిర్యాదు చేయండి. మీరు గ్యారంటరుగా ఉన్నారు కాబట్టి అతడు కట్టలేని స్థితిలో మీరు కడతామనేది కంపెనీ వారికిచ్చిన గ్యారంటీ బాండు దీని నుండి చట్ట ప్రకారం మీరు తప్పించుకోజాలరు. చిట్‌కంపెనీ వారు కోర్టు కెళ్ళి డిక్రీ పొందుతారు. అటుపిమ్మటే మీ జీతాలకు అటాచ్‌మెంట్ పొందుతారు. కాని అతను కట్టలేకపోతే మీరు చెల్లించకుండా తప్పుకోలేరు.

ఇంటిపేరు వేరుగా వుంది...

నేను మా అమ్మమ్మగారింటి దగ్గర పెరిగినందున వాళ్ళే స్కూల్లో చేర్పించారు. మా ఇంటి పేరు పిప్పోజి, అమ్మమ్మ ఇంటిపేరు అందె. అమ్మమ్మ వాళ్లకు మా ఇంటి పేరు తెలియక అందె అని రాయించారు. నేను చిన్నవాణ్ణి అయినందున తెలియక అది అలాగే ఉండిపోయింది. ఇపుడు నా వయస్సు 27 సంవత్సరాలు. నా స్కూల్ రికార్డుల్లో అందె మహేందర్, తండ్రి రాములు అని ఉంది. కాని అసలు పేరు పిప్పోజి మహేందర్ బాబు, తండ్రి రాములు అని ఉండాలి. అయితే నేను ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీస్ వైద్యం చేశాను. నా వృత్తిలో నేను నెంబర్‌వన్‌గా ఉన్నాను. నా పిఎంపి సర్టిఫికేట్ పిప్పోజి మహేందర్‌బాబు పేరుమీద ఉంది. నా ఎస్‌బిహెచ్ బ్యాంక్ అకౌంటు, డ్రైవింగ్‌లైసెన్స్ గ్రామపంచాయతి రికార్డులు ఇల్లు, రేషన్ కార్డు, ఓటు హక్కు గుర్తింపు కార్డు అన్నీ పిప్పోజి మహేందర్ బాబు మీద ఉన్నాయి. ఎల్ఐసి పాలసీ కూడా ఉంది. ఇప్పటికైతే చదివిన ఎస్ఎస్‌సి సర్టిఫికెట్‌తో అవసరం రాలేదు. కాని భవిష్యత్తులో అవసరం రావచ్చు. ఎస్ఎస్‌సి సర్టిఫికెట్ నా అసలు పేరు మీదికి మార్చుకోవాలంటే నేనేం చేయాలి? అందుకు ఎంత ఖర్చవుతుంది? ఎక్కడికి వెళ్ళాలి, ఎవర్ని కలవాలి? భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేయాలంటే కనీస అర్హత ఎస్ఎస్‌సి వుండాలికదా? అప్పుడెలా? పాస్‌పోర్టు గురించి కూడా ఎస్ఎస్‌సి మెమో అవసరముంటుంది. భవిష్యత్తులో ఇంకేదైనా అవసరం రావచ్చు. అందుకే తర్వాత ఇబ్బంది కలుగకూడదని అడుగుతున్నాను.

డాక్టర్ పిప్పోజి మహేందర్‌బాబు,
రాయికల్, కరీంనగర్ జిల్లా.

హైదరాబాద్‌లోని చంచల్‌గూడ ప్రభుత్వ ముద్రణాలయంలో పేరు, ఇంటి పేరు మార్పుకోసం పత్రాలు దొరుకుతాయి. ఉచితంగానే ఇస్తారు. ఆ పత్రాలు పూర్తిచేసి ఎంఆర్ఓ గారితో సంతకం తీసుకుని మీ దగ్గరలోని పోలీస్‌స్టేషన్లో, అందె మహేందర్ పేరిట ఎటువంటి కేసులూ లేవని పత్రం జతచేసి 300 రూపాయల రాజపత్రం (గెజిట్‌లో) ముద్రించుటకు చెల్లించాలి. ఆ రాజ పత్రంలో ముద్రించిన తర్వాత మీరు మీ పేరును పిప్పోజి మహేందర్‌గా గుర్తించినట్లవుతుంది. మీరు మీ ఎస్ఎస్‌సి సర్టిఫికెట్‌తోపాటు ఈ రాజపత్రం జిరాక్స్ పెట్టి ఎప్పుడు, ఎందుకైనా పిప్పోజి మహేందర్‌గా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇంటి సంగతులు

నీటి న్యాయం

ఇంద్రగంటి జానకీబాల

ఒక్కసారిగా వీధిలో చిన్న కలవరం మొదలైంది. నిశ్శబ్దంలోంచి శబ్దం. మొదట్లో మనిషి గొంతుపైకి లేవలేదు. బిందెల శబ్దాలు, బకెట్ల జరుపుళ్ళు, రకరకాల పాత్రల చప్పుళ్ళు... ఆనక "నీళ్ళొచ్చాయి – నీళ్ళొచ్చాయి" అనే మాట ఆ నోటా ఈ నోటా వీధంతా పాకి గలగలలాడింది.

ఇంట్లో ఏదో పనిచేసుకుంటున్న తులసమ్మ ఆ పని అక్కడొదిలేసి, వీధిలోకి వచ్చి చూసింది. 'నిజమే నీళ్ళొచ్చాయి' అనుకుని కొంగు పైకి దోపి రంగప్రవేశం చేసింది.

అప్పటికే సుమారు యాభై, అరవై సరుకులు క్యూలో చేరాయి.

తులసమ్మ కంగారేం పడలేదు. పైపెచ్చు దర్జా ప్రదర్శిస్తూ "ఎందుకమ్మా అంత కంగారు? చాలాసేపు వస్తాయి నీళ్ళు. ఒక్క పావుగంట ఓపిగ్గా వున్నారంటే నేను పట్టేసుకుని వెళ్ళిపోతాను. ఆ తర్వాతంతా మీదే.. ఏమ్మా, ఎండలో ఎందుకూ పడిగాపులు? అందరూ వరసలో నిలబడి వృథా ప్రయాస. ఒకపక్కన ఎండ నెత్తిమీదికొచ్చింది చూడండి.. ఇళ్ళల్లోకెళ్ళిపొండి. ఎలాగూ నా పనికాంగానే వదిలేస్తాను.. ఎంత, ఒక్క పావుగంట.. ఏమ్మా చెప్తూంది మీక్కాదూ? ఆమాత్రం ఓర్పు లేకపోతే ఎలా? నే చెప్తున్నాగా.." అంటూ తులసమ్మ రోడ్డు పంపుకు ట్యూబు తగిలించి ఇంట్లోకి లాగింది. అందరూ భయంగా, అక్కసుగా, కోపంగా చూస్తూ పక్కకి తొలుగుతున్నారు.

ఒక యువకుడు మాత్రం కాస్త ఆశ్చర్యంతో పౌరుషంగా ముందుకొచ్చి "ఇదేంటండీ, అన్యాయం? రోడ్డుమీదున్న నీళ్ళపంపుకు ట్యూబువేసి ఇంట్లోకి లాక్కుని ఇంతమందిని వెయిట్ చెయ్యమంటే ఒక్కరూ మాట్లాడరే?!" అన్నాడు.

"ఎందుకంటే బాబూ... ఆమె ఈ వీధిలో పంపు వేయాల్సి వచ్చినపుడు డబ్బు కట్టి వాళ్ళింటి ముందు వేయించుకుందట. అందుకని దీనిమీద సర్వహక్కులూ ఆమెవేనట. ఆమె నీళ్ళు కావలసినన్ని పట్టుకున్నాక వదిలితే అప్పుడు మిగిలినవాళ్ళు పట్టుకోవాలట" అన్నాడో పెద్దమనిషి.

"డబ్బులు కడితే ఇంట్లోనే వేయించుకోవచ్చుగా, రోడ్డుమీద వేయించి సంఘసేవకు పూనుకుందా?" అన్నారు మరొకరు.

"అ.. ఏంలేదు. పంపులు వేసేప్పుడు కాసిని డబ్బులు లంచంపెట్టి గుమ్మందగ్గర వేయించుకుంది. ఇంక అది తన సొంతపంపని, తనకే దానిపై హక్కు వుందని, నోరుపెట్టుకుని అరుస్తూ నెగ్గుకొస్తోంది" అంటూ తేల్చారొకరు.

"ఇలా కుదరదండీ... విషయం తేలాల్సిందే" అన్నాడు ఉడుకురక్తం ఉరకలేస్తోన్న యువకుడు.

అనడంతో సరిపెట్టక వేగంగా వెళ్ళి ట్యూబు లాగేసి తాను తెచ్చిన బకెట్‌తో నీళ్ళు పట్టుకుంటుంటే, ఎవరికి వాళ్ళే సంబరంగా వచ్చి తమ బిందెలు పంపుకిందపెట్టి నీళ్ళు నింపుకోసాగారు.

ఐదు నిమిషాల్లో అమ్మవారిలా వచ్చింది తులసమ్మ బయటకి. చెంగుదోపి "ఎవడ్రా ఆ ట్యూబు తీసింది?" అంటూ పెద్దగా హూంకరించింది.

అక్కడున్న వాళ్ళూ ఊరుకోలేదు. దాంతో రభస మొదలైంది. 'డబ్బు కట్టిన రసీదు చూపించు', 'డబ్బు కట్టి ప్రత్యేకంగా పెట్టించినదానివే అయితే నీ ఇంట్లోనే ఎందుకు పంప వేయించుకోలేదూ?' – అంటూ నిలదీశారు.

ఆవిడ అర్థంపర్థంలేకుండా అడ్డంగా వాదించబోయింది. అయితే ఎంతకాలంగానో భరిస్తున్నవాళ్ళకి సహనం నశించింది. అణచుకున్న కోపమంతా వెల్లువై ప్రవహించడంతో కచ్చగా ఎదురుతిరిగారు.

తులసమ్మ తగ్గిపోవలసివచ్చింది.

ఈ గొడవ జరుగుతుండగా అందరూ హాయిగా నీళ్ళు పట్టేసుకుని గొడవచేస్తున్న వీరుల బిందెలు కూడా పట్టి పెట్టేశారు. ఒక గంటలో చాలావరకు జనం పల్చబడిపోయారు.

తులసమ్మ ఇంట్లోకి నీళ్ళు రాలేదుగానీ కళ్ళల్లోకి నీళ్ళొచ్చాయి.

ఇంతకీ అసలు సంగతేమంటే వీధిపంపులు బిగించేవాళ్ళొచ్చినపుడు తులసమ్మ వారిని దగ్గరికి పిల్చి మాట్లాడింది. సూపర్‌వైజర్ చేతిలో రెండొందలుపెట్టి పంపు తన గుమ్మందగ్గర పెట్టించుకుని దానిమీద తనకి సర్వహక్కులూ వున్నాయని ప్రచారంచేసింది. తెలిసీతెలియని జనం ఆవిడ నోటికి భయపడి కొంత, విషయం అర్థంగాక కొంత, అసలంటూ నీళ్ళు దొరుకుతున్నాయిలెమ్మనే ఊరటతో కొంత సరిపెట్టుకుంటూ వస్తున్నారు. ఆ భయాన్ని, సర్దుబాటుతనాన్ని ఆసరా చేసుకుని తులసమ్మ తాగే నీటిని స్నానాలకి, బట్టలుతకడానికి అంట్లగిన్నెలు కడగడానికి, మొక్కలకు – అన్నింటికీ వాడుకోవడం మొదలెట్టింది. ఉక్రోషంకొద్దీ ఎవరైనా ఏమన్నా అనబోతే "అసలది నా పంపు" అంటూ దబాయించేది.

కాస్త చదువుకుని, విషయం అర్థంచేసుకున్నవాళ్ళు ఓర్పు నశించి ఎదురుతిరిగేసరికి తులసమ్మ అక్రమం బయటపడింది. ఆవిడ ఆగడానికి అడ్డుకట్ట పడింది.

మున్సిపాలిటీవాళ్ళు డబ్బులు తీసుకుని అక్కడికేదో లాభంచేసినట్టు భ్రమ కలిగిస్తారు. ఇక చాలామంది తుల సమ్ములు వీధిపంపుల్ని అంటిపెట్టుకుని వదలమని మొరాయిస్తారు. పేరు తులసమ్మే అయినా ఆమె కలుపుమొక్కే కనుక పీకి పారేయక తప్పదు.

నీరు, గాలి, భూమి అందరివీ అంటారు. కానీ వాటినీ కొందరు దౌర్జన్యం చేస్తారు. మనమే పోరాడి వాటిని సాధించుకోవాలి.

*

వి నాగరత్న

ప్రోత్సాహం

ప్రోత్సాహం మాటలోనే ఉత్సాహం ఇమిడివుంది. నిజంగా మనల్నెవరైనా ప్రోత్సహిస్తే కలిగే ఉత్సాహం అంతా ఇంతా కాదు. కానీ అందుకు సిద్ధంగా వుండం. అవతలివారిలో వున్న మంచిని గుర్తించి మెచ్చుకుంటే మన సంపదలన్నీ తరిగిపోతాయన్నట్లు మౌనంగా వుండిపోతాం. ఇంకా మాట్లాడ్తే ఆ పనిని లేదా వారిని తక్కువచేస్తూ చులకనగా మాట్లాడి గేలిచేయబోతాం. కారణం మన చూపు చాలా చిన్నది. పైగా ఇతర్లను మెచ్చుకోవడమంటే మనల్ని మనం తగ్గించుకోవడం అనే అపోహ ఒకటుంది.

క్లాస్‌రూంలో ఒక పిల్లవాడు బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకున్నపుడు ఆ సబ్జెక్ట్ టీచర్ మెచ్చుకుంటుంది. అదేదో మొక్కుబడి వ్యవహారం కాదు,

ఎంతో సహజంగా చేస్తుందా పని. చాలా నిర్లిప్తంగా 'ఆ.. ఏముంది, పది చెట్లలో ఓ చెట్టు ఎత్తుగా వున్నట్లు ఎవరో ఒకరికి ఫస్టుమార్కులు ఎలానూ వస్తాయి.. ఇందులో ప్రత్యేకత ఏముంది? మెచ్చుకుని మేకతోలు కప్పాలా?' అనుకుంటే కొన్నిసార్లు నష్టం వాటిల్లే ప్రమాదముంది. ఆ తెలివైన పిల్లవాడు నిరుత్సాహానికి గురవుతాడు. 'ఇంత బాగా చదివానుగదా, కొంచెం మెచ్చుకుంటే టీచర్ సొమ్మేం పోతుంది?' అని బాధపడ్తాడు. ఒకవేళ తెలివైన తల్లిదండ్రుల అండదండలు వున్నవాడైతే "పోన్లే ఆవిడకంత సహృదయత లేకపోతే నేనేం చేస్తాను? అయినా నా చదువు నా కోసమేగదా" అని సరిపెట్టుకుంటాడు. సున్నితమనస్కులు మట్టుకు 'ఎంత చదివినా ఒకటేలే.. గుర్రానికీ గాడిదకీ తేడా తెలీని టీచరు' అనుకుని చదువును నిర్లక్ష్యం చేసినా ఆశ్చర్యంలేదు. ఆ ఆలోచన పసిగట్టి సరిచేస్తే పర్లేదు. అలాగే కొనసాగితే మట్టుకు చదువుపట్ల ఆసక్తి సన్నగిల్లే అవకాశం వుంది. ఇంతకీ ప్రశంసలు అందజేసినందువల్ల టీచర్‌కి వాటిల్లే నష్టమేంటి? ఇంకా చెప్పాలంటే తెలివైనవారికి అభినందనలే కాకుండా వెనకబడినవాళ్ళు కూడా ఆ ప్రశంసలవల్ల బోల్డంత స్ఫూర్తి పొందుతారు. తామూ పోటీపడి చదివి ఆ మెచ్చుకోళ్ళను సొంతం చేసుకోవాలని ఆరాటపడతారు.

ఇది కేవలం పిల్లలకే పరిమితం కాదు. ఇంటాబయటా కూడా అభినందించాల్సిన సందర్భాలు అనేకం ఎదురౌతుంటాయి. ఇల్లు కొనడంలో భాగంగా భర్త తన జలసాలు, సాదరుఖర్చులు తగ్గించుకుని చాలా పొదుపు చేయనారంభిస్తాడు. కానీ భార్య అదేం గుర్తించనట్లే 'ఇందులో విశేషమేముంది? ఇల్లేమైనా తన ఒక్కదానికోసమా? ఇల్లేర్పడాలంటే ఖర్చులు తగ్గించుకోక తప్పదు. ఈ మాత్రపు దానికి ఆయనగార్ని అందలాలు ఎక్కించాలా?' అనుకుంటుంది. అలాగే భార్యామణి ఏదో టీవీ ఛానల్లో చూసిన కొత్త వంటకాన్ని ఎంతో కష్టపడి వండి పెనిమిటికి వడ్డించినపుడు ఆ మానవుడు 'ఆహా అద్భుతంగా వుంది' అని కాదుగదా 'ఇదేంటి?' అని కూడా అడక్కుండా ఏదో తినక తప్పదు గనుక తింటున్నానన్నట్లు ఎక్స్‌ప్రెషనిస్తే సహజంగానే ఆవిడగారి కోపం నషాళానికంటుతుంది. ఇక కూతురు రన్నింగ్‌రేస్‌లో తనకు ప్రైజొచ్చిందని, కొడుకు లెక్కల్లో తనకు 98 మార్కులొచ్చాయని సంతోషంగా చెప్పారు. తల్లి "ఆటలేం కూడు పెట్టవు. నువ్వేం పీటీ ఉష, మలసమ్మల్లా ప్రపంచ అథ్లెటిక్స్‌లో పాల్గొనబోవడంలేదుగానీ చదువుమీద శ్రద్ధ పెట్టు" అంది. పోతే తండ్రి "ఏం లెక్కల్లో 98 రావడమేంటి? అదేం గొప్ప సంగతి కాదు... నూటికి నూరొస్తే అదీ విశేషం" అనేసి యథాలాపంగా పేపర్లో మునిగిపోయాడు. ఆ క్షణంలో ఆ పిల్లల మనసు ఎంతగా నొచ్చుకుని వుంటుంది కదూ?! అంటే ఇక్కడ 'ఎంత మంచి వాడవురా...' అని భార్య 'ఇల్లాలే ఈ జగతికి జీవనజ్యోతి' అని భర్త పాటలు పాడాలని, పిల్లలు సాధించిన విజయాలగురించి తల్లిదండ్రులు భట్రాజుల్లా పొగడాలనో కానేకాదు. అతివృష్టి అక్కర్లేదు, కేవలం అనావృష్టి లేకుంటే చాలు.

ఇక్కడ చిత్రమేమిటంటే ఎవరికి వాళ్ళు తమని గుర్తించాలని ఆరాటపడ్తారు. కానీ తాము ఆచరించడంలో ఫెయిలయ్యారు.

'ఆ.. ఏముంది ప్రత్యేకత.. మామూలేగా' అనేది మనకి తరచూ వినిపించే మాట. ఇది నిజంగా యాంత్రికత లేదా నిర్లిప్తత కారణంగా వస్తుంది. రెండూ శుభసూచికాలు కావు. యంత్రాల్లా మారితే జీవనమాధుర్యాన్ని కోల్పోతాం. ఇక నిర్లిప్తత చోటుచేసుకుంటే అసలు జీవితేచ్ఛే పోయే ప్రమాదముంది. స్ఫూర్తి అని ఓ చక్కటి పదముంది. చేసిన మంచి పనిని ప్రశంసించడంవల్ల ఆ వ్యక్తికి బోల్డంత స్ఫూర్తి కలుగుతుంది. అంటే బేసికల్‌గా ఎవరైనా గుర్తింపును కోరుకుంటారు. ఆ ప్రోత్సాహం టానిక్‌లా పనిచేస్తుంది. అవతలివారిలో ఆ స్పందన కనిపిస్తే పొంగిపోయి మరింత బాగాచేయాలనుకుంటారు. స్పందన కరువైతే చైతన్యం నశిస్తుంది. ఎంత కష్టపడినా గుర్తింపు వుండదని నిరాశకు లోనవుతారు.

బంగారం ఒకళ్ళు మెచ్చుకుంటే మెరుస్తుందా? వజ్రాన్ని ఎవరైనా ప్రశంసిస్తేనే తళుకులీనుతుందా అనే మాటలు వాదించడానికి పనికొస్తాయేగానీ ఉత్సాహాన్ని పోగొట్టి నిస్సత్తువకు దారితీసే నిజాన్ని చెరిపేయలేవు. ఎందుకంటే మనం గోల్డో, స్టోన్సో కాము. జవజీవాలున్న మనుషులం. ఎన్నెన్నో ఉద్రేకాలకు గురవుతాం, బలవుతాం. లేకుంటే ఇన్నిన్ని మానసిక వత్తిళ్ళు, జబ్బులు ఎందుకొస్తున్నాయి? అదే బంగారమైతే తనను ప్రేమగా చెక్కిళ్ళకు తాకించుకుంటే ఉబ్బిపోయి రెండు గ్రాములు పెరగదు. విసిరికొట్టినంతలో చిన్నబుచ్చుకుని చిక్కిశల్యమై రెండు గ్రాములు తగ్గదు.

రాళ్ళూ లోహాల సంగతలా వుంచి ఎలాంటి పరిస్థితుల్లో కూడా కుంగిపోని, పొంగిపోని ధీశాలులు కొందరుంటారు. మహాత్మాగాంధీ, మదర్ థెరిసా ప్రభృతులు ఇందుకు ఉదాహరణలు. కానీ అలాంటి ఆణిముత్యాలెప్పుడూ అరుదే. అసలా స్థాయికి చేరితే ఇక లేనిదేముంది? అప్పుడసలు దూషణభూషణాల గురించి పట్టించుకునే తీరికా ఓపికా ఎక్కడివి? వాళ్ళకి తమ ఆశయసాధనే టానిగ్గా పనిచేస్తుంది.

*

సీరియల్

గొల్లపూడి నారాయణరావు

(వాడనుండి ఇంటికిరాగానే పటేలు గ్రామ రైతులందరినీ పిలిపించాడు. ఎక్కువ కూలి ఇచ్చయినా సరే పొరుగూళ్ళ కూలీలను తెప్పించుకుని పని చేయించుకున్నట్లయితే ఊళ్ళో వున్న కూలీలు దిగొస్తారని కొందరు, అది సబబు కాదని ఇంకొందరు అభిప్రాయపడ్డారు)

(20 వ భాగం)

ఇక ఇళ్ళకు ఎల్తాం" అన్నాడు పెద్దిరెడ్డి.

"వెళ్తే వెళ్ళారు. ఇంకోసారి బాగా ఆలోచించుకుని చెప్పండి" అన్నాడు పటేలు.

పెద్దిరెడ్డి తలూపాడు కానీ మాట్లాడలేదు.

బ్రహ్మారెడ్డి మాత్రం "ఇందులో ఆలోచించేదేమీ లేదు. మా వరకు ఉన్నూరి కూలీలతోనే వేయిస్తాం" అని కండితంగా చెప్పేశాడు. ఇక మారుమాట లేకుండా అక్కడినుండి చరచరా నడిచెళ్ళాడు. అతడి వెంట మిగతావారంతా బయటికెళ్ళిపోయారు. ఇక అక్కడ మిగిలిందల్లా జానకిరాంరెడ్డి – పటేలు ఇద్దరు మాత్రమే.

జానకిరాంరెడ్డి వెళ్తున్న వారివైపు చూసి తలూపాడు. పటేలు పళ్ళు పటపట నూరాడు.

''ఇదంతా – బ్రహ్మారెడ్డి, పెద్దిరెడ్డి – వీరిద్దరి దగ్గరే ఉంది''



అన్నాడు జానకిరాంరెడ్డి.

"అవును జానకయ్యా, ఆ పెద్దిరెడ్డిదగ్గర మరీ ఉంది. కపట వినయం చూపిస్తాడేగాని సమయం వచ్చేసరికి చూడు ఎట్లా మాట్లాడాడో? ఉన్నూరి కూలీలతో వేయించటమే సబబట. దొంగముండాకొడుకు" అన్నాడు పటేలు.

"అందుకే అతగాడి తిక్క వదిలే మార్గం చూడకూడదూ"

"చూద్దాం తొందరపడితే ఎట్లా?"

''ఇంతకూ బదేమియా జాడలేకుండా పోయాడేమిటి?''

"గుర్రాన్ని పెద్దిరెడ్డి గిత్త పొడిచి చంపేసిందని ఇప్పటికి నాలుగుత్తరాలు రాశాను. అతడి దగ్గర్నుండి ఒక్క జవాబు రాలేదు"

"అతడికీ విషయం తెలిస్తే రాకుండా ఉండేవాడు కాదే? కారణం ఏమిటబ్బా?"

"ఇంటివద్ద లేరని విన్నాను. వాళ్ల మత నాయకుడు పిలిపిస్తే పట్నం వెళ్లాడట. ఈ నెల రోజుల్నుండి అక్కడే ఉంటున్నాడని తెలిసింది"

"అదా విషయం? అందుకే తాత్సారం జరిగింది" అంటూ తలూపాడు జానకిరాంరెడ్డి.

తర్వాత రెండు నిమిషాలపాటు ఇద్దరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు.

చివరికి పటేలు "ఏమోయ్ జానకయ్యా చివరికి మనమిద్దరమే మిగిలిపోయాం. ఏం చేద్దామంటావు?" అని అడిగాడు.

"నీ ఇష్టమే నా ఇష్టం బావయ్యా"

''వాళ్లకు లొంగి వాళ్లడిగినంత ఎందుకివ్వాలాని నా పట్టుదల"

"అలా అనుకుంటే ఈ పూటే పొరుగూరి కూలీలకోసం మనిషిని పంపించు బావయ్యా. ఇవ్వాళ రేపటిలో మా పొలంకూడా వేతకొస్తుంది గదా?"

"సరే సాయంత్రం మా పాలేరును పంపిస్తాలే" అన్నాడు పటేలు.

తర్వాత జానకిరాంరెడ్డి లేచి ఇంటి దోవ పట్టాడు.

ఆ రోజు పొద్దుకుంకింది.

తిరిగి చీకటిపడే వేళకు జానకిరాంరెడ్డి వచ్చాడు.

"బావయ్యా, మీ పాలేరును కూలీలకోసం పంపావా" అనడిగి కూర్చున్నాడు.

"పంపాను కాని, ఇంకా వాడు రాలేదోయ్. నేనూ అదే చూస్తున్నాను" అన్నాడు పటేలు.

"చూశావా మరి, ఇవాళ ఉదయం మనమందరమూ ఇక్కడ కూర్చుని మాట్లాడుతున్నప్పుడు కోదండరాంరెడ్డి ఇంటివద్ద కూలివాడ జనమంతా గుమికూడిందట''

పటేలు తలూపి నిట్టూర్చాడు. ''ఇంతకూ ఏం జరిగిందక్కడ?" అడిగాడు.

"ఆయన పొలమంతా ఒప్పుకున్నారట"

"అట్లాగా? ఎంత రేటు?"

"ఎకరానికి ఇరవై అయిదు మానికలట"

''దొంగలంజాకొడుకులు నాతో ముప్పయి మానికలని వాగారు గదా"

ముసిముసినవ్వు నవ్వాడు జానకిరాంరెడ్డి. ''ఏమంటావయ్యా? అట్లావుంది పటేలుతనం" అన్నాడు.

పటేలు కోపంతో బుసకొట్టాడు.

"అనుభవిస్తారు, తొందరెందుకు" అని, "ఈ కూలివాడ జనం మన పొలాల్లో ఎక్కడ కనిపించినా గుంజుకొచ్చి గుంజకు కట్టేసి కొట్టాలి" అన్నాడు తిరిగి.

"చెరువుకింద మాగాణి సగం మనిద్దరిదే గదా? గడ్డీగాదం కోసమైనా

రాకపోతారా? దొరక్కపోతారా?"

"అదే నా ఆలోచన. దొంగ గాడిదకొడుకులు నిక్కు చూపినందుకు తగిన శాస్తి జరిపించాలి. అప్పుడు వీళ్లందర్నీ కోదండరాంరెడ్డి రక్షిస్తాడేమో చూద్దాం"

"ఆ కోదండరాంరెడ్డి ఒక్కడూ వచ్చి మనపక్కన నిలబడ్డట్టయితే ఈ సంవత్సరం కూలీలు అరిచి చచ్చేవాళ్లు. కాని....."

"అబ్బే అతగాడు మనతో కలిసొచ్చేరకం మనిషి కాదు. ఉన్నవాడన్న మాటేగాని ఒట్టి మెతకమనిషి. ఇంట్లో ఆడదానికి జవాబు చెప్పలేకనే గదా వంకాయలవాణ్ణి అల్లుడిగా తెచ్చిపెట్టుకున్నాడు?"

"బావయ్యా వాళ్ళల్లుడు బాగా చదువుకున్నవాడట నిజమేనా?"

"పట్నంలో చదువు వెలిగించాడట. అయినా ఈ రోజుల్లో చదువెవడు చూస్తున్నాడోయ్? అసలు పనిముద్దు, భాగ్యం ముద్దు అన్నారు గాని చదువు ముద్దు, సంధ్య ముద్దు అనలేదుగదా?"

"నిజమే బావయ్యా, మన రైతులకు నాలుగు కొంద్రలు అదనంగా ఉండాలిగాని చదువులెందుకూ?"

"అందుకే కదయ్యా మా వాడికి అరకపని నేర్పించాను"

"అదినరేగాని బావయ్యా ఒక విషయం ఎప్పుడూ అడుగుదామనుకుంటానే మరిచిపోతుంటాను. అబ్బాయికసలు చదువే వంటబట్టలేదగదా. నీ తర్వాత పటేలుతనం ఎవరు చేస్తారూ?"

పటేలు నవ్వి "ఒక గుమస్తాను పారేస్తే వాడే చేసుకపోతాడు" అన్నాడు.

ఈ విధమైన సంభాషణ వారిద్దరిమధ్య సాగిపోతోంది. ఇంతలో సామేలు వచ్చాడు. అతణ్ణి చూడగానే ఇద్దరి హృదయాలు తహతహలాడినయి.

"కూలీలు దొరికారట్రా?" అడిగాడు పటేలు.

"తీరిక లేదన్నారండీ" అన్నాడు సామేలు.

పటేలూ, జానకిరాంరెడ్డి నిరాశతో కుంగిపోయారు. రెండునిమిషాలు మౌనంగా గడిచిపోయినయ్.

చివరికి "ఏ ఊరేవూరు వెళ్ళావు?" అనడిగాడు పటేలు.

"మన ఊరి చుట్టూరా ఉన్న ఊళ్లన్నీ తిరిగొచ్చానండీ. అన్ని ఊళ్లలోనూ ఇప్పుడే ముమ్మరంగా నాట్లు సాగుతున్నాయి. ఎక్కడి వాళ్లక్కడే గుత్తలు ఒప్పుకొని ఉన్నారు"

"హెచ్చు రేట్లు ఇస్తామని చెప్పలేదూ?"

"చెప్పానండి"

"మరేమన్నారు?"

"పులిగూడెం కూలీలు ముప్పై మానికలనేసరికి కాస్త మెత్తబడ్డారు. కాని ఆ ఊరి రైతులు ఆ రేటు మేమే ఇస్తామని వచ్చారు. దాంతో మెత్తబడిన కూలీలు పొరుగూళ్లు రావడానికి మాకు తీరిక లేదులెమ్మని చెప్పారు" అన్నాడు సామేలు.

బావమరుదులిద్దరూ కోరలు పీకిన తాచుపాముల మాదిరి వేలగిలపడి పోయారు. సామేలు అక్కడి నుండి వెళ్లిపోయాడు.

"ఇప్పుడు మన పనేమిటి బావయ్యా?" అన్నాడు జానకిరాంరెడ్డి.

"అదే ఏమీ తోచడంలేదోయ్" అన్నాడు పటేలు. అతడి మాటలు పూర్తిగా ఆవేదనాపూరితమై బయలువెడలినయ్. పైకి చూస్తూ గొప్ప ఆలోచనలో పడిపోయాడు.

రెండు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచిపోయినయ్. కాసేపటికి "బావయ్యా ఇక ఆలోచనెందుకూ? మన గ్రామంవాళ్లనే పిలిపించి వాళ్లు అడిగిన రేటు ఇస్తామంటే సరిపోదూ?" అన్నాడు జానకిరాంరెడ్డి.

మరుక్షణమే పటేలు ఇంటికప్పు ఎత్తున ఎగిరిపడి "ఛీ, ఛీ ఎంత మాటన్నావు?" అనరిచాడు.

జానకిరాంరెడ్డి బిక్కుబిక్కుమంటూ కూర్చున్నాడు. భర్త అరుపుకు శాంతమ్మ బయటికొచ్చింది.

"ఈ సంవత్సరం మన పొలాలన్నీ బీళ్లుపడిఉన్నా మంచిదే. కాని కూలీల వద్ద లొంగిపోయే ప్రసక్తిలేదు" అన్నాడు పటేలు తిరిగి.

"పట్టుదలతో పొలాలు బీళ్ళ పెట్టుకుంటే ఇక మనం తినేది ఏమిటయ్యా?" అంది శాంతమ్మ.

"చాల్లే పోవే నీకెందుకూ?" అంటూ భార్యను గదిమాడు పటేలు.

"అన్నీ నీకెందుకూ అనేగదా ఇట్టా చేసుకవస్తున్నావు. ఇకముందు తిండిగింజలు కూడా లేకపోతే బతికేదెట్టాగయ్యా?" అందామె.

"నిజమే బావయ్యా బాగా ఆలోచించు" అన్నాడు జానకిరాంరెడ్డి.



బరువుగా నిట్టూర్పు వదిలాడు పటేలు. "మరి నన్నేం చేయమంటావు జానకయ్యా? ఆ కూటికిలేని వెధవల దగ్గర మాత్రం లొంగిపోను. మరీ అంతగా కాకపోతే మన అన్నానికి సరిపోయేట్లుగా రెండెకరాల పొలం స్వయంగా నాటుపెట్టుకుందాం" అన్నాడు.

"సరిపోయిందిక. ఇప్పటికే ఇంట్లో విడిచిన గుడ్డలన్నీ చచ్చేట్లు ఉతుకుతున్నాగదా? రేపటినుండి నాట్లు వేయడానిక్కూడా బయలుదేరాలన్నమాట" అంది శాంతమ్మ నిట్టూరుస్తూ.

"నీవు ఒక్కదానివే ఏమిటి? నేను మాత్రం బయలుదేరనూ?" అన్నాడు పటేలు.

తర్వాత కాసేపటికి జానకిరాంరెడ్డి లేచి నెమ్మదిగా ఇంటికి బయలుదేరాడు.

✪ ✪ ✪

ఉదయం నాలుగుగళ్ల పొద్దెక్కింది. కోదండరాంరెడ్డి పొలంలో కూలీలు మునుములుపట్టి నాటుకు వంగారు. చకచకా నాటువేయడం సాగిపోతోంది. కూలీలందరూ కలిసి ఏకకంఠంతో పాట పాడనారంభించారు.

"ఘనుడు రాజారెడ్డి తుమ్మెదా,
సంగనాయకుడోయి తుమ్మెదా.." అనే వంతతో పాట జోరుగా సాగుతోంది. అప్పుడే పటేలు తన మురాతో అక్కడికొచ్చాడు. నాటు వేస్తున్న కూలీలవైపు, గెనెంపై నిలబడ్డ కోదండరాంరెడ్డి వైపు చురచుర చూశాడు. తర్వాత ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

అంతలోనే ఆయన మేనగోడలు పూర్ణమ్మ "మామయ్యా, నారుకట్టలు తీసుకురా" అని కేకవేసింది.

అంతటితో పటేలు పేటుకందువా వల్లెవాటు దీసి తక్కిరిబిక్కిరిగా తలకు చుట్టాడు. నారుమడిలో దిగి రెండుచేతులా నారు కట్టలు తీసుకుని నాటువేసే మడివద్దకు మోసుకెళ్లాడు. మడినిండా నారు పరిచేసరికి వంటినిండా చెమటలు కారిపోతున్నాయి.

"పాపం, మామయ్య చెమటలుగారి పోతున్నాడు" అంది పూర్ణమ్మ. ఆమె ఒంగి నాటు వేస్తోంది.

"కాదటే మరీ? అన్నయ్య పుట్టి పెరిగిన తర్వాత ఎప్పుడైనా పనిచేశాడా ఏమన్నానా?" అంది సీతమ్మ.

"ఎవరు చేయమని ఏడిచారు, ఈయనతో" అంది శాంతమ్మ.

"నిజం అంతేనమ్మా, ఎవరు చేసుక్కుది వారే అనుభవిస్తున్నారు" అన్నాడు జానకిరాంరెడ్డి.

"చాల్లేవయ్యా, మహాలావుగా, అన్నయ్యవైపుకు చూడు. ఈ ఎండకు ఎట్లా రొప్పుతున్నాడో? ఆయన్ని చూసి మీకు ఎట్టా అనబుద్ది అవుతోంది" అంది సీతమ్మా.

ఇంతలో పటేలు నారుకట్టలు ఎత్తుకొచ్చాడు. చేతిలో కట్టలు మడిమీద జల్లుతూ "ఏమర్రోయ్, కుచ్చునాటుమాత్రం వేయకండి" అన్నాడు.

(ఇంకా వుంది)

క్యాంపస్ ఛాట్

అమృత

ఫ్రెషర్స్‌కు సీనియర్స్ టిప్స్...

సీనియర్స్ కొన్ని తప్పటడుగులు వేశారు. వాటినుండి గుణపాఠాలూ నేర్చుకున్నారు. అవే తిరిగి కొత్తగా కాలేజీలో చేరేవాళ్ళముందు ప్రత్యక్షం కానున్నాయి. ఫ్రెషర్స్ వీటిబారిన పడకూడదని ఆశిస్తూ హైదరాబాద్ కళాశాల విద్యార్థులు కొన్ని టిప్స్ చెపుతున్నారు చూడండి...

జూన్ వచ్చిందంటే మళ్ళీ కాలేజీ తలుపులు తెరుచుకున్నట్టే. ఇక విద్యార్థుల్లో కాస్త నిర్లిప్తత, మరికాస్త హుషారు నింపుతాయి. అమ్మాయిల్లోనైతే కాస్త బెరుకు, ఇంకాస్త భయమూ మామూలే. అయితేనేం ఎప్పుడెప్పుడాని ఎదురుచూస్తూ, కాలేజీ క్యాంపస్‌లోకి అడుగుపెట్టాలని తహతహలాడుతుంటారు. అయితే కొత్తగా క్యాంపస్‌లో అడుగుపెట్టేవారికి ఏ కాలేజీలో



చేరాలి. ఏ గ్రూపు తీసుకోవాలి అనేది పెద్ద సమస్యగా మారుతుంది. పాత ఫ్రెండ్స్ స్నేహం వదులుకోలేక వాళ్ళు ఏ గ్రూప్ తీసుకుంటే, అదే గ్రూప్ తీసుకునే పొరపాట్లు ఇంటర్‌లో చేరేటప్పుడే చేస్తుంటారు. ప్రతి క్లాస్‌లోనూ బెస్ట్ ఫ్రెండ్స్ ఉంటారు. కానీ పై క్లాసులకు వెళ్లేటప్పుడు కూడా వాళ్లే ఉండాలని, వాళ్ళు తీసుకున్న కోర్సులే తీసుకోవాలన్న రూలేమీ లేదు. అలాని రాజీపడితే మనకిష్టమైన కోర్సును తీసుకోలేం. మన భవిష్యత్‌ను మనమే చేతులారా పాడుచేసుకున్నవాళ్ళమవుతాం. పాతవారిని మరిచిపోకుండానే, కొత్తవారితో స్నేహంచేసే మనస్తత్వాన్ని అలవాటు చేసుకోవాలి.

ఇక కొత్తగా కాలేజీలో అడుగుపెడుతున్నారంటే ముందుగా భయపెట్టేది ర్యాగింగ్. ప్రతి కాలేజీలోనూ ఇది కామన్‌గా ఉండేదే. కో-ఎడ్యుకేషన్ కాలేజీల్లో మరికాస్త ఎక్కువ. అలాగని మనం భయపడి కాలేజీకి వెళ్ళక ఇంట్లో కూర్చోవటం మంచిదికాదు. దీన్ని తప్పించుకోవటానికి ఉపాయం లేకపోలేదు. క్యాంపస్‌లో తిరిగేటప్పుడు వీలున్నంతవరకు సీనియర్స్‌తో కలిసి తిరిగితే కొంత వత్తిడి తగ్గుతుంది. లేదా నలుగురైదుగురు గ్రూప్‌గా ఉంటే మానసిక స్థైర్యం వస్తుంది. సీనియర్స్ కూడా గ్రూప్‌లోంచి ఒకళ్ళనే బయటికి లాగి ర్యాగింగ్ చేసే ధైర్యం చేయలేరు. ఇక మరీ శృతిమించి ర్యాగింగ్ చేస్తుంటే ప్రిన్సిపల్ లేదా లెక్చరర్‌కు కంప్లయింట్ చేయాలి. భయపడుతున్నకొద్దీ మరీ ఎక్కువ చేస్తుంటారు. కనుక పరిస్థితులకు అనుగుణంగా మనం మారుతుండాలి.

క్యాంపస్‌లో అడుగుపెట్టగానే ఫ్రెషర్స్‌కు వెల్‌కమ్ అంటూ కాలేజీ క్యాంపస్‌లో సైన్‌బోర్డులు, హోర్డింగ్‌లు, వాల్ రైటింగ్స్ కనిపిస్తాయి. ఫ్రెషర్స్‌కున్న భయం పోగొట్టటానికి ర్యాగింగ్ ప్రారంభిస్తే అదికాస్తా భూతంలా భయపెడుతోంది. అందుకే ఫ్రెషర్స్‌కున్న సిగ్గు, భయం పోగొట్టటానికి గెట్ టు గెదర్, ఫ్రెషర్స్ డే అంటూ ఫంక్షన్ ఎరేంజ్ చేస్తున్నారు. దీనివల్ల ఓ ప్రయోజనం ఉంది. కొత్తగా చేరినవారికి కొన్ని కళల్లో ప్రావీణ్యం ఉండవచ్చు. అలాంటివాళ్లు తమ టాలెంట్‌ను నిరూపించుకునే అవకాశం ఇస్తుంది. పైగా వాళ్ళని వాళ్లు ప్రూవ్ చేసుకోవటానికి ఇదో వేదిక. ఇందులో పాల్గొన్న ప్రతివారినీ పాటలు పాడమనీ, డాన్స్ చేయమనీ, ఎవరినైనా అనుకరించమనీ... ఇలా ఏదైనా అడుగుతారు. అలా వాళ్ళు తమ ప్రతిభను నిరూపించుకోవచ్చు. అటు గుర్తింపూ వస్తుంది, మరోపక్క చాలామంది మరెంతోమందితో స్నేహం చేయటానికి ఇదో వారధి అవుతుంది.

కాలేజీకి వెళ్తున్నారంటే తల్లిదండ్రులు పెద్దమొత్తంలోనే డబ్బులిస్తారు. అంతమాత్రాన జల్సాగా ఖర్చుచేయటం మంచిదికాదు. సినిమాలు, షికార్లు, పార్టీలంటూ తిరిగితే మరుసటిరోజుకు పర్స్ ఖాళీ అవుతుంది. అందుకే సమయసందర్భాలనుబట్టి మన పర్సులోని డబ్బు ఖర్చు చేయాలి. అలా మనల్ని మనం కంట్రోల్ చేసుకోలేకపోతే జీవితంలో దెబ్బతింటాం. అంతేకాదు, ఇప్పుడే డబ్బును దుబారా చేస్తే, తర్వాత ఆ అలవాటు పెద్దపెద్ద ఖర్చులకు దారితీస్తుంది. అందుకే ఓ నియమం పెట్టుకోవాలి. ప్రతినెలా పాకెట్‌మనీ నుండి ఓ మంచి పుస్తకం కొనుక్కోవాలి. దాని వెల ఎంతైనా కావచ్చు. హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ప్రజాశక్తి వంటి ప్రచురణ సంస్థలు పదిహేను నుండి పాతిక రూపాయల లోపు మంచి బుక్‌లెట్స్ అందిస్తుంటారు. వాటితో ప్రారంభించి అలవాటుచేసుకున్నట్లయితే, అదే భవిష్యత్‌లో ఓ మంచి మార్గం చూపుతుంది.

సాధారణంగా కాలేజీస్థాయిలో యూనిఫారమ్‌ను మెయింటైన్ చేయడం బహుఅరుదు. ఇక కాలేజీకి వెళ్తున్నారంటే అమ్మాయిల ఆనందానికి పట్టపగ్గాలు ఉండవు. అయితే కొత్తగా మోడ్రన్ డ్రస్‌లు వేసుకునేవారికి ఇదో పెద్ద సమస్య. జీన్స్, టాప్స్ వేసుకోవడానికి సందేహపడుతుంటారు. కానీ అలా భయపడుతూ ఉంటే అలాగే ఉంటారు. ఎలాంటి ఇబ్బందీ లేదనిపిస్తే, కాలేజీలో చేరిన మొదటిరోజుల్లోనే మనకిష్టమైన డ్రెస్సులు వేసుకోవాలి. నాలుగురోజులు అలవాటుపడ్డారంటే తోటి స్టూడెంట్స్ నుండి ఎటువంటి కామెంట్లూ ఉండవు. బస్సులు, టూ వీలర్‌పై వెళ్లేప్పుడు మనకు రక్షణగా ఉండే డ్రస్ వేసుకోవటం మంచిది.

కొందరు వెనుక బెంచీల్లో కూర్చుని కామెంట్స్ చేస్తుంటారు. ప్రతివిషయాన్నీ సీనియర్స్‌తో పోల్చి చూసుకోవటం మంచిదికాదు. సీనియర్స్ ఐనందున, వాళ్ళు లెక్చరర్లతో క్లోజ్‌గా ఉండటం సహజమే. మనకు ఆ స్థాయిలో అవగాహన ఉంటేనే వారితో సరదాగా మాట్లాడాలి. అంతేకానీ అతి చేస్తే అభాసుపాలవుతారు. ఇక సాధారణంగా ఐదారుగురు కలిసి ఓ గ్రూప్‌గా కలిసి తిరుగుతుంటారు. అలాగని ఎప్పుడూ మరో గ్రూప్‌పై కామెంట్స్ చేయకూడదు. కాలేజీకి చదువుకోడానికి వెళ్ళినా పరిచయాలు, పలకరింపులకోసం కొందరు జట్టుగా విడిపోతారు. అంతమాత్రాన మరో బ్యాచ్‌పై జోకులేయటం, వారిని ఎగతాళి చేయడం మంచిదికాదు. ఇలాంటి చిన్నచిన్న సమస్యలే పెద్దవై ముదురుతాయి. కాలేజీ క్యాంపస్‌లనేవి అన్నింటినీ ఆహ్వానిస్తాయి. కనుక మన జాగ్రత్తలో మనం ఉండటం మనకే మంచిది.

*

చందు



హాస్య నటుడు
శ్రీ రాళ్ళపల్లి గారు
చెప్తోన్న కబుర్లు....

మా ఆవిడ సపోర్ట్‌తో ఉత్తరం రాశా

తూర్పు గోదావరిజిల్లా సామర్లకోటకు 20 కిలోమీటర్ల దూరంలోగల రాచపల్లి అనే పల్లెటూర్లో 1945 ఆగస్టు 15న పుట్టాను. తల్లిదండ్రులకు నేను 14వ సంతానాన్ని. ప్రస్తుతం ముగ్గురు అన్నయ్యలు, అక్క ఉన్నారు. కిర్లంపూడి స్కూల్లో ఫస్ట్ ఫారమ్ వరకు, అన్నయ్య దగ్గరుండి రామచంద్రాపురం స్కూల్లో టెన్త్ వరకు చదివాను. 1959లో రెండో అన్నయ్యకు హైదరాబాద్‌లో జాబ్ వచ్చింది. దీంతో లెవెన్త్, ట్వెల్త్, బిఎస్సీ హైదరాబాద్‌లో చదివాను. సహజంగా పెద్దవాళ్ళందరూ పిల్లల్ని బాగా చదివించాలనుకుంటారు. కానీ చదవకపోవడం నా దౌర్భాగ్యం. అన్నయ్యలు కూడా నేను బాగా చదివితే డాక్టర్‌ని చేద్దామని ఆశపడ్డారు. హైదరాబాద్ వచ్చిన సంవత్సరమే 'కన్యాశుల్కం' నాటకంద్వారా నాటకాల్లోకి ప్రవేశించాను. అప్పట్నుంచి నాటకాలపైనే తప్ప చదువుపై శ్రద్ధ లేదు. ఓ పక్క రైల్వేలో ఉద్యోగం చేస్తూనే నాటకాలాడుతూ ఉన్నా. 'ముగింపు లేని కథ' అనే నాటకం రాసి ఇప్పటివరకు 98 ప్రోగ్రామ్స్ ఇచ్చాను. 1974లో కొమ్మూరి వేణుగోపాలరావుగారి 'హారతి' అనే నవలను కె. ప్రత్యగాత్మగారు సినిమాగా తీస్తున్నారు. దానికోసం హీరోహీరోయిన్లు కావాలని ప్రకటన ఇచ్చారు. 'క్యారెక్టర్ ఆర్టిస్టుగా నాటక అనుభవముంది కదా.. ఉత్తరం రాయండి' అని మా మావిడ సపోర్ట్ చేసింది. 'నేను ఆరడుగుల ఎత్తు ఉండను, నా మొహం చంద్రబింబంలా అందంగా ఉండదు కనుక హీరో వేషానికి పనికిరాను. కానీ కమేడియన్‌గా నాటకాలాడిన అనుభవం ఉంది. అవకాశమిస్తే ఏ వేషమైనా వేస్తాను' అని లెటర్ రాశాను. ఆ ఉత్తరం ప్రత్యగాత్మగారిని బాగా ఆకట్టుకుంది. రమ్మని టెలిగ్రామ్ ఇచ్చారు. నటనలో పరీక్షపెట్టారు. అందులో పాసవ్వడంతో అవకాశమిచ్చారు. నా తొలి చిత్రం 'స్త్రీ'. బి.యస్. నారాయణగారి దర్శకత్వంలో 'ఊరుమ్మడి బతుకులు' చిత్రంలో మొదటిసారి పెద్ద క్యారెక్టర్ పోషించాను. 'చలిచీమలు' ఆర్టిస్టుగా గుర్తింపు తీసుకొచ్చింది. 'తూర్పు వెళ్ళే రైలు' కమర్షియల్‌గా బ్రేక్ ఇవ్వడమే కాకుండా ఆడియన్స్‌లో గుర్తింపు ఇచ్చింది. 1978లో ఉద్యోగానికి రాజీనామాచేసి సినిమా ప్రయాణాన్ని ప్రారంభించాను. ఇప్పటివరకు 750 పైచిలుకు చిత్రాల్లో నటించాను.

కష్టానికి తగ్గ ఫలితం దక్కింది

దర్శకుడు విజయబాపినీడుగారి అల్లుడు వల్లభనేని జనార్ధన్ డైరెక్షన్ చేసిన తొలి చిత్రం 'అమాయక చక్రవర్తి'. విజయశాంతి, చంద్రమోహన్ హీరోహీరోయిన్లు. శ్రీశైలం వెళ్ళే దారిలో దిండిగల్ అనే ఊర్లో వంద ఎకరాల విస్తీర్ణంగల చెరువు, దాని పక్కన ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్ ఉంది. సినిమా షూటింగ్ చాలావరకు అక్కడే జరిగింది. ఆ రోజుల్లో జయమాలిని యమా బిజీ ఆర్టిస్ట్. తెలుగు సినిమా అంటే జయమాలిని ఉండి తీరాల్సిందే. ఆ రోజుల్లో ఆమె కెరీర్ అప్రతిహతంగా సాగిపోతూ ఉండేది. అమాయక చక్రవర్తిలో లంబాడీ కన్య వేషం వేసింది. ఆమెకు ముగ్గురు అన్నలు(నూతన్ ప్రసాద్, రచయిత కాశీ విశ్వనాథ్, నేను). చెల్లిని బాగా ప్రేమగా పెంచుతాం. రాజకుమారుడికిచ్చి వివాహం చేయాలనుకుంటాం. ఏమైనా సరే నేనే పెళ్ళి చేసుకోవాలనేది మేనమామ వరసైన గోకిన రామారావు పట్టుదల. జయమాలినిపై 10, 12 సీన్లు, ఒక పాట తీయాల్సి ఉండగా ఆమె రెండు రోజులు మాత్రమే కాల్షీట్లు ఇచ్చింది. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల దాకా సన్నివేశాల చిత్రీకరణ. రాత్రంతా పాట షూటింగ్. రెండు రోజులపాటు ఇదే తంతు. మూడోరోజు రాత్రి పది గంటల దాకా సన్నివేశాలు చిత్రీకరించి షూటింగ్ పూర్తిచేశారు. ఏకధాటిగా 72 గంటలపాటు నాన్‌స్టాప్‌గా షూటింగ్‌లో పాల్గొనేటప్పటికి కళ్ళలో కారం చల్లినట్లు భగభగ మండాయి. ఒళ్ళు స్వాధీనంలో లేదు. మూడు రోజులు భోజనం లేకపోయినా ఫర్వాలేదు కానీ ఒకరోజు నిద్ర లేకపోతే భరించడం కష్టం. షూటింగ్ ముగిసిన రోజు రాత్రే హైదరాబాద్ లక్డీకాపూల్లో వున్న ద్వారకా లాడ్జికి వచ్చేశాను. మరుసటిరోజు ఉదయం ఎనిమిదిగంటల ఫ్లైట్‌కి బయలుదేరి మద్రాస్ వెళ్ళి అక్కడి షూటింగ్‌లో పాల్గొనాలి. రిసెప్షన్‌లో వున్నవ్యక్తికి తప్పకుండా లేపమని చెప్పి పడుకున్నాను. విపరీతంగా ఆకలేయడంతో మెలకువ వచ్చింది. తలుపుల్లోంచి వెలుతురు వస్తోంది. తెల్లవారుజామున నాలుగింటికి ఇంత వెల్తురు ఉండదుకదా అని రిసెప్షన్‌కి ఫోన్ చేస్తే సాయంత్రం నాలుగైందన్నారు. 'ఎనిమిది గంటల ఫ్లైట్‌కి మద్రాస్ వెళ్ళాలి లేపమని చెప్పాను కదా?!'ని అడిగితే... 'ఫోన్ల మీద ఫోన్లు చేసినా, తలుపులు బాదినా మీరు లేవలేదు సార్' అన్నారు. చేసేదేమీలేక సాయంత్రం ఫ్లైట్‌కి మద్రాస్ వెళ్ళాను. ఆ చిత్ర దర్శక నిర్మాతలు నా పరిస్థితి అర్థం చేసుకున్నారు కనుక నన్ను మన్నించి వదిలిపెట్టారు. కష్టానికి తగ్గ ఫలితం ఉంటుందని చెప్పడానికి ఈ ఉదంతాన్ని చెప్పాను. కొసమెరుపు ఏమంటే... ఈ చిత్రంలోని నా పాత్రకుగాను 'మద్రాస్ ఫిలిం జర్నలిస్ట్ అసోసియేషన్' వాళ్ళు బెస్ట్ కమెడియన్ అవార్డు ఇచ్చారు. మూడురోజులు నిద్ర లేక శారీరకంగా శ్రమపడ్డప్పుడు అసలు ఎందుకొప్పుకున్నానురా ఈ వేషం అని బాధపడ్డాను. కానీ అవార్డు రావడంతో ఎంతో ఉత్తేజాన్ని పొందాను.

(ఇంకా వుంది)

దారి కనుక్కోండి



బుడతలూ...! ఇక్కడ మూడు సున్నాలున్నాయికదా. పైన బయలుదేరి కిందకి చేరాలి. మరి ఆలస్యం ఎందుకుకంట. బయలుదేరండీ!

ఎవరి ఇల్లు ఏదో!

హేయ్! ఇక్కడ కొన్ని ప్రాణులు , అవి నివసించే ఇళ్లు వున్నాయి. ఎవరి ఇల్లు ఏదో గుర్తించి జత చెయ్యండి మరి.



కవల కప్పలు ఏవబ్బా!



ఆరు తేడాలు కనుక్కోండోచ్!

నేస్తాలూ... ఇక్కడ రెండు బొమ్మలున్నాయికదా. చూడ్డానికి అవి రెండూ ఒకేలా వున్నా ఆరు తేడాలున్నాయి. మీరు ఏం చేయాలంటే పెన్నో, పెన్సిలో తీసుకుని చకచకా ఆ తేడాలను కనిపెట్టెయ్యాలి.

చిన్నారి చిత్రకారులు

ఎ.భరత్ కుమార్,
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, (ఊరు పేరు రాయలేదు.)

బడే గాయత్రీ కుమారి,
3వ తరగతి,
జడ్‌పిహెచ్‌ఎస్,
కుందల తిరుమడ,
జియమ్మ వలస,
విజయనగరం.

చుక్కలు కలిపితే...



హేయ్ం! ఇక్కడ సముద్రంలో వెళుతున్న నావను ఎవరో చూస్తున్నారు. కాకపోతే వారు చుక్కల్లో వున్నారు. వారెవరో తెలుసుకోండి మరి.

రంగులు అద్దేద్దాం



బుజ్జాయిలూ... చుక్కలున్న భాగాలకు రంగులు అద్ది చూడండి. మీకో చక్కటి బొమ్మ కనిపిస్తుంది. మరి ఆలస్యం ఎందుకర్రా!

అట్టమీది కథ

వానజల్లు

భూస అప్పలరెడ్డి

ప్రకృతిలో వర్షంకంటే అందమైంది, అవసరమైంది ఇంకోటిలేదు. అలాగే అవధిమీరితే దానికంటే భయంకరమైంది, నాశనకరమైందీ కూడా ఇంకేదీలేదు. వానజల్లే లేకపోతే అసలు మనిషికి మనుగడేలేదు. తాగడానికి నీళ్ళులేక నోరెండిపోతుంది. పైరూపంటా నామ రూపాల్లేకుండా పోతాయి. భూమి బీటలు వారుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే నీరుంటేనే ప్రాణం నిలుస్తుంది. వరండాలో నిలబడి చూస్తోంటే వానజల్లు గమ్మత్తుగా వుంటుంది. వర్షం వడ్తుండగా గాలొచ్చిందో అది మరిన్ని వంపు సొంపులుపోతూ పులకరింప జేస్తుంది. వర్షాన్ని చూసి మురిసిపోని కవులంటూ వుండరు. ఇక వానొస్తే చిన్నారుల సంబరం సంగతి చెప్పనవసరం లేదు. నీళ్ళల్లో కేరింతలుకొడ్తారు.

ఇది జ్యేష్ఠ మాసం. తొలకరిజల్లులు కురుస్తున్నాయి. ఈ సందర్భంగా రుతుపవనాలపై ప్రత్యేక కథనం.

నేల మీద పడ్డ ప్రతి వర్షపు చుక్కా మంచి ముత్యమే. నెర్రలు విచ్చుకున్న పుడమి తల్లి గొంతు తడిపి పుష్పించి విత్తై మెతుకై జీవకోటికి బతుకై ఫలవిస్తుంది. పల్లవిస్తుంది. అటువంటి వర్షపు చినుకులను కురిపించే మేఘాలను మోసుకొచ్చేవే రుతుపవనాలు...

దేశంలో అత్యధిక వర్షపాతం రుతుపవనాల వల్లే వస్తోంది. ఇందులో నైరుతి రుతుపవనాల ఆధిక్యమే ఎక్కువ. వీటివల్ల 70శాతం వర్షం పడితే, ఈశాన్య రుతుపవనాల వల్ల కేవలం 20శాతం మాత్రమే కురుస్తోంది. ఇతరత్రా కారణాల వల్ల 15శాతానికి మించి పడటంలేదు. అయితే మానవ తప్పిదాలు, ప్రకృతి ప్రకోపాల వల్ల గత 50 ఏళ్లలో అల్పపీడనాలు, వాయుగుండాలు ఏర్పడటం గణనీయంగా తగ్గిపోయినట్టు వాతావరణ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా గత దశాబ్దన్నర కాలంలో ఏటా వేళ్లమీద లెక్కించదగ్గ సంఖ్యలో మాత్రమే ఇవి ఏర్పడుతున్నాయి. కొన్ని వాయుగుండాలు, తుఫాన్లు ఎక్కడో నడి సంద్రంలో ఏర్పడి భూమివైపు తొంగి చూడకుండానే బలహీనపడిపోతున్నాయి. ఇటువంటి తరుణంలో ప్రాణకోటికి జీవనాధారమైన వర్షపు చినుకు కోసం తప్పనిసరిగా రుతుపవనాలమీదే ఆధారపడాల్సి వస్తోంది.

రుతుపవనాలంటే...?

భారత వాతావరణ పరిశోధనాశాఖ విభాగం నిర్వచనం ప్రకారం రుతుపవనం అంటే గాలి దిశలో మార్పు. మన దేశంలో ముఖ్యంగా దక్షిణ భాగంలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ నైరుతి దిశ నుంచి వీచే గాలులను నైరుతి రుతుపవనాలు గానూ, అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో ఈశాన్యదిశ నుంచి వీచే గాలులను ఈశాన్య రుతుపవనాలుగానూ పేర్కొంటున్నారు. ఇంకా చెప్పాలంటే జనవరి నుంచి జులై వరకూ గాలి దిశ కనీసం 120 డిగ్రీలు ఉండాలి. తరువాత గాలి వేగం కొద్ది నెలల పాటు సెకనుకు మూడు మీటర్లు ఎక్కువగా ఉండాలి. గాలిదిశ 40శాతమైనా నైరుతిదిశలో ఉండాలి. ఇవేకాకుండా ఉష్ణోగ్రతల్లో మార్పులు, ఉపరితలంలో బలమైన గాలుల దిశ మారటం వంటివన్నీ రుతుపవనాల రాకను ప్రభావితం చేస్తాయి.

ఎక్కడెక్కడకు ఏఏ ప్రాంతాల నుంచి?

నైరుతి రుతుపవనాలు

నైరుతి రుతుపవనాలు మన దేశానికే కాకుండా ఆగ్నేయాసియా, జపాన్, చైనాలో కొంత ప్రాంతానికి వ్యాపిస్తాయి. మన దేశంలో సాధారణంగా జూన్ నెలలో నైరుతి రుతుపవనాలు కేరళను తాకుతాయి. నైరుతి రుతుపవనాలు కేరళను తాకేముందు దక్షిణార్ధగోళం నుంచి గాలులు బయల్దేరి ఆఫ్రికాలోని మెడగాస్కర్ మీదుగా వచ్చి భూమధ్యరేఖను దాటి అరేబియా సముద్రంలోకి ప్రవేశిస్తాయి. వీటిలో ఒక శాఖ బంగాళాఖాతం మీదుగా వచ్చి మొట్టమొదటిగా అండమాన్ దీవులను తాకుతుంది. అక్కడనుంచి ఉత్తరంగా పయనిస్తూ భారతదేశం మీదుగా వచ్చి జులై 15కి దేశమంతటా ఆక్రమించుకుంటుంది. సాధారణంగా మే 20న అండమాన్ దీవుల్లోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయి. మే 25కల్లా శ్రీలంక, బంగాళాఖాతంలో కొంతభాగం వ్యాపించి జూన్ ఒకటో తేదీ నాటికి కేరళలో జొరబడతాయి.

జూన్ ఐదోతేదీకల్లా కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశిస్తాయి. పదో తేదీకల్లా ఆంధ్రప్రదేశ్‌ను దాటి ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ మీదుగా పయనించి జూన్ 15 నాటికి ఉత్తరప్రదేశ్, గుజరాత్, జులై ఒకటో తేదీనాటికి రాజస్థాన్

ప్రాంతాలకు వ్యాపించి జులై 15 నాటికి దేశమంతటా విస్తరిస్తాయి. దక్షిణ ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాలు మినహా దేశంలోని అన్నిప్రాంతాల్లోనూ నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల వర్షాలు విస్తారంగా పడతాయి. దేశంలో నమోదయ్యే వార్షిక వర్షపాతంలో 70శాతం నైరుతి రుతుపవనాల వల్లే పడుతుంది. దక్షిణ ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదవుతుంది. వీటి ప్రభావం మన రాష్ట్రంలో తెలంగాణా, ఉత్తర కోస్తాపైన ఉంటుంది. దక్షిణకోస్తాలో ఈశాన్య రుతుపవనాల ప్రభావం వల్ల ఎక్కువగా వర్షాలు పడతాయి.

ఈశాన్య రుతుపవనాలు

నైరుతి రుతుపవనాలు నిష్క్రమించిన తరువాత అక్టోబర్‌లో ఈశాన్యంనుంచి వీచే గాలులే ఈశాన్య రుతుపవనాలు. దేశంలో నమోదయ్యే వార్షిక వర్షపాతంలో 20శాతాన్ని ఇవి ఇస్తాయి. వీటి ప్రభావం ఎక్కువగా దక్షిణ ఆంధ్ర, తమిళనాడులపై ఉంటుంది. ఈ ఏడాది రుతుపవనాల వల్ల సాధారణ వర్షపాతం అంటే 93శాతం (సగటు వర్షపాతం 93 సెంటీమీటర్లు) నమోదవుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని విశాఖపట్నంలోని ఇండియన్ మెటీరియాలజీ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ రాళ్లపల్లి మురళీకృష్ణ చెప్పారు. నైరుతి రుతుపవనాలు కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లో కొంతభాగం, తెలంగాణా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా, బెంగాల్, బీహార్‌సహ ఈశాన్యరాష్ట్రాల్లో ఎక్కువ వర్షాలు కురిపిస్తాయి. ఉత్తర భారతదేశంలో చలికాలంలో కూడా వర్షాలు పడతాయి. వీటిని వింటర్ రెయిన్స్ అంటారు.

ద్రోణి... వాయుగుండాలు... తుఫాన్లు...

వాతావరణ పీడనంలో హెచ్చు తగ్గుల వల్ల ద్రోణి ఏర్పడుతుంది. ఆ ప్రాంతంలోని ఉష్ణోగ్రతలు కూడా ప్రభావం చూపిస్తాయి. ఒక ప్రదేశంలో ఉష్ణోగ్రత మరీ ఎక్కువగా ఉంటే గాలి పైకి లేచి పీడనం తగ్గుతుంది. అప్పుడు చుట్టుపక్కలున్న పీడనంతో పోల్చిచూసి ఆ ప్రాంతంలో అల్పపీడన ద్రోణి ఏర్పడినట్లు గుర్తిస్తారు. ఆ ప్రదేశంలో ఇంకా ఎక్కువ పీడనం తగ్గితే అల్పపీడనం ఏర్పడుతుంది. ఆ చుట్టుపక్కలున్న అధికపీడనం ప్రాంతం నుంచి గాలులు ఈ అల్పపీడనం వైపు పయనిస్తే వాయుగుండం, తుఫాన్లు ఏర్పడతాయి. గాలి వేగం పెరుగుతున్న కొద్దీ తీవ్ర తుఫాన్లు, అతి తీవ్ర తుఫాన్లుగా మారతాయి. ద్రోణి భూ ఉపరితలంలో ఏర్పడితే దానిని ఉపరితల ద్రోణిగా పేర్కొంటారు. భూమిపై తగినంత నీటి ఆవిరి ఉండనందున ద్రోణులు, అల్పపీడనాలు స్వల్ప వ్యవధిలోనే బలహీనపడి పోతాయి. సాధారణంగా నైరుతి రుతుపవనాల కాలంలో అల్పపీడనాలు లేదా వాయుగుండాలు మధ్య బంగాళాఖాతం, ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడి పవనాల తీవ్రత పెరగడానికి దోహదపడతాయి. అటువంటి సమయంలో అధిక వర్షపాతం నమోదవుతుంది.

బంగారుపళ్లానికైనా గోడ చేరువ కావాలి

రుతు పవనాలు బలం పుంజుకోవాలంటే అల్పపీడనాలు లేదా వాయుగుండాలు ఏర్పడాలి. అప్పుడే ఎక్కువ వర్షాన్నిస్తాయి. పవనాలు మరింత చురుగ్గా కదలడానికి కూడా ఇటువంటి వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తాయి. కాస్త ముందూ వెనుకా తప్ప రుతుపవనాలు రాకపోవడమంటూ ఎప్పుడూ ఉండదు. ఇవి మనదేశాన్ని ఏటా పలకరించి పులకరింపజేసే జీవన పవనాలు. మిగతా దేశాల్లో వేర్వేరు వాతావరణ పరిస్థితులుంటాయి. నైరుతి రుతుపవనాల కాలంలో మేఘాలు తక్కువ ఎత్తులో అంటే భూమికి ఐదు, ఆరు కిలోమీటర్ల ఎత్తులో ప్రయాణం చేస్తూ వర్షపుజల్లులను కురిపిస్తాయి. వాయుగుండం, తుఫాన్లు వంటివి ఏర్పడ్డప్పుడు మేఘాలు 12 కిలోమీటర్ల ఎత్తుపైకి వ్యాపిస్తాయి. ఇంత ఎత్తులో మేఘాలున్నప్పుడు మెరుపులు, ఉరుములు పుడతాయి. ఇటువంటి మేఘాలు రుతుపవనాల రాకముందు అంటే మే నెలలో ఎక్కువగా వచ్చే అవకాశముంది. ఉరుములతో కూడిన జల్లులు, పెనుగాలులు కూడా ఈ సమయంలో వస్తాయి. ఒక్కొక్కప్పుడు ఈ పెనుగాలుల వేగం గంటకు వందకిలోమీటర్ల వరకూ ఉంటుంది. ఈ సమయంలో చెట్లు నేలకూలడం, హోర్డింగులు విరిగిపడటం వంటివి జరుగుతాయి. అయితే ఇవి ఎక్కువ సేపు ఉండవు.

వడగళ్లు...

మేఘాలు చాలా ఎత్తు వరకూ ఏర్పడ్డప్పుడు వాటిలో ఆరు కిలోమీటర్ల ఎత్తుకన్నా పైన ఉన్న మేఘాల్లో నీటి ఆవిరి ఘనీభవించడం వల్ల మంచుగడ్డలు ఏర్పడతాయి. మేఘాలు వర్షించినప్పుడు ఈ మంచుగడ్డలు కిందపడతాయి. చాలా మంచు గడ్డలు కరిగిపోయి తిరిగి నీటి ఆవిరిగా మారిపోతాయి. అప్పుడప్పుడూ కొన్ని మంచుగడ్డలు భూమిని తాకుతాయి. వీటిని వడగళ్లు అంటాము. వడగళ్లవాన ఎక్కువగా ఎండాకాలంలో అదికూడా నైరుతి రుతుపవనాలు వచ్చే ముందు పడుతుంది.

బ్రేక్ మాన్‌సూన్

యాక్టివ్ మాన్‌సూన్

నైరుతి రుతుపవనాలు దేశమంతటా వ్యాపించిన తరువాత హిమాలయాల దాకావెళ్లి అక్కడ ఆగిపోతాయి. ఇందువల్ల హిమాలయాల ప్రాంతంలో వర్షాలు అధికంగా కురుస్తాయి. మిగతా ప్రాంతాల్లో వర్షపాతం తగ్గిపోతుంది. దీనిని బ్రేక్ మాన్‌సూన్ అంటారు. ఆ సమయంలో అల్పపీడన ద్రోణి ఏర్పడితే హిమాలయాల వద్ద అత్యధిక వర్షపాతం నమోదు కావడంతోపాటు దీని ప్రభావం మైదానప్రాంతంలో రాజస్థాన్ నుంచి పశ్చిమ బెంగాల్ మీదుగా ఉత్తర బంగాళాఖాతం వరకూ వ్యాపిస్తుంది. వీటిని ఆక్టివ్ మాన్‌సూన్ అంటారు.

మరీ ముందుగా...మరీ ఆలస్యంగా...

నైరుతి రుతుపవనాలు



1960లో అతి తొందరగా దేశంలో ప్రవేశించాయి. ఆ ఏడాది మే 14వ తేదీకల్లా కేరళలో ప్రవేశించాయి. 1972లో అతి ఆలస్యంగా ప్రవేశించాయి. ఆ ఏడాది జూన్ 18న కేరళను తాకాయి.

ఈ ఏడాది...

ఈ ఏడాది మే 18 నాటికి నైరుతి రుతుపవనాలు అండమాన్ దీవుల్లోకి ప్రవేశించాయి. మే 25 నాటికి శ్రీలంకను దాటి మర్నాడు నిర్ణీతకాలం కంటే ఐదు రోజులు ముందుగా కేరళను తాకాయి. తమిళనాడును దాటుకొని మే 27కి కర్నాటకలో ప్రవేశించి దక్షిణ ఆంధ్ర, కోస్తాంధ్రలో నెల్లూరు వరకూ వ్యాపించాయి. 28 నాటికి గోవా, బళ్లారి, ఒంగోలు వరకూ వ్యాపించాయి. జూన్ ఒకటో తేదీ నాటికి ఆంధ్రప్రదేశ్ అంతటా విస్తరించాయి.

మన దేశంలోకి ఈ సమయంలోనే ఎందుకొస్తాయి...?

మన దేశానికి కింద భూమధ్యరేఖకు దిగువన దక్షిణార్ధ గోళంలో ఇప్పుడు శీతాకాలం. దక్షిణార్ధ గోళంలో మడగాస్కర్ ప్రాంతంలో వాతావరణంలో ఎక్కువ పీడనం ఈ కాలంలో ఉంటుంది. ఈ గాలులు వాతావరణంలో తక్కువ పీడనం ఉన్న మన దేశంవైపుకి వస్తాయి. ఇలా సుమారు 3000 కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. హిందూ మహాసముద్రం మీదుగా ఎక్కువదూరం ప్రయాణించి, మనదేశంలోకి రావడం వల్ల ఈ గాలుల్లో 80 నుంచి 90 శాతం నీటి ఆవిరి ఉంటుంది. మనదేశంలో భూమిపైనుంచి ఆరేడు కిలోమీటర్ల ఎత్తులో మేఘాలు ఏర్పడతాయి. వాతావరణం అనుకూలించినప్పుడు వర్షాలు బాగా పడతాయి. నైరుతి దిశ నుంచి ఈ గాలులు రావడం వల్ల వీటిని నైరుతి రుతుపవనాలంటారు. భూమి పడమటి నుంచి తూర్పుకు తిరుగుతుంది. అందువల్లే దక్షిణార్థ గోళం నుంచి వచ్చే ఈ గాలులు మనదేశం మీదకి వస్తాయి.

ప్రస్తుతం వస్తున్నవి పడమటి గాలులు

నైరుతి దిశ నుంచి వచ్చే గాలులు హిందూ మహాసముద్రంపై ఎక్కువ దూరం ప్రయాణించి దేశంలోకి రావడం వల్ల వాటిలో నీటి ఆవిరి ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఇవి మనకు ఎంతో ఉపయోగపడతాయి.

ఇప్పుడు పడమటి భాగం నుంచి గాలులు వస్తున్నాయి. పడమటి భాగంలో అరేబియా సముద్రం ఉంది. అరేబియా సముద్రం నుంచి ఈ గాలులు కేవలం 500 నుంచి 600 కిలోమీటర్లు ప్రయాణించి ఇవి మన దేశ భూభాగంపైకి వస్తున్నాయి. సముద్రంపై తక్కువ దూరం ప్రయాణించడం వల్ల ఈ గాలుల్లో నీటి ఆవిరి పెద్దగా ఉండదు. మన భూభాగంపై దీని ప్రభావం వల్ల మేఘాల పొర పల్చగా ఉంటుంది. ప్రస్తుతం వస్తున్నవి పడమటి గాలులు. అందువల్లే పెద్దగా వర్షాలు లేవు.

నైరుతి రుతుపవనాల్లో మన వాటా 70 నుంచి 150 సెంటీమీటర్లు

ఐఎండి అసిస్టెంట్ డైరెక్టర్ రాళ్లపల్లి మురళీకృష్ణ

నైరుతి రుతుపవనాల వల్ల మన రాష్ట్రంలో 70 నుంచి 150 సెంటీమీటర్ల వరకూ వర్షపాతం నమోదవుతుందని ఇండియన్ మెటీరియాలజీ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ రాళ్లపల్లి మురళీకృష్ణ చెప్పారు. కోస్తా ఆంధ్రలో 60 నుంచి 70శాతం వర్షపాతం నమోదవుతుందని, మిగతా దానిని ఈశాన్య రుతుపవనాలు భర్తీ చేస్తాయని చెప్పారు. సాధారణంగా ఉత్తరాంధ్రలో సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లోనే, దక్షిణ ఆంధ్రలో అక్టోబర్, నవంబర్ నెలల్లోనూ అధిక వర్షపాతం నమోదవుతుందని చెప్పారు. రాయలసీమలో 60 సెంటీమీటర్ల కంటే తక్కువగా వర్షపాతం నమోదవుతుందని, ఇక్కడ నైరుతి రుతుపవనాల వల్ల కొంత, ఈశాన్య రుతుపవనాల వల్ల మరికొంత వర్షపాతం ఉంటుందని చెప్పారు. తెలంగాణాలో 70శాతం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని, ఇక్కడ కూడా నైరుతి రుతుపవనాలవల్లే ఎక్కువ వర్షాలు పడతాయని చెప్పారు. జూన్, జులై నెలల్లో తెలంగాణాలో ఎక్కువగా వర్షాలు కురుస్తాయని చెప్పారు.

*

గాలుల్లో రకాలు, స్వభావాలు

గాలి వేగం (కి.మీ)	పేరు	లక్షణం
40-50	ఒక మోస్తరు గాలులు	చెట్ల కొమ్మలు విరిగిపడిపోతాయి
51-61	ఈదురుగాలులు	పెద్ద పెద్ద చెట్లు సైతం అల్లల్లాడుతాయి. నడవడం కష్టంగా ఉంటుంది.
62-74	హోరుగాలి	కొమ్మలు విరిగిపడతాయి
75-87	బలమైన గాలులు	చెట్లు కొమ్మలు విరిగిపడతాయి. ఇళ్ల పై కప్పులు ఎగిరిపోతాయి.
88-101	పెనుగాలులు	చెట్లు కూకటివేళ్లతో సహా కూలిపోతాయి.
102-120	తుఫాను గాలులు	విద్యుత్ స్తంభాలు కూలుతాయి. వాహనాలు ముందుకు కదలవు.
120-ఆపైన	పెను తుఫాను గాలులు	భవనాలు, విద్యుత్ స్తంభాలు కూలుతాయి. అపార నష్టం జరుగుతుంది.

ఆరోగ్యం

మార్గదర్శిని

వేదగిరి రాంబాబు

పునర్జన్మలున్నాయా – అనే ప్రశ్నకు భిన్న సమాధానాలు రావచ్చు. విభిన్న అభిప్రాయాల వ్యక్తీకరణ జరుగవచ్చు. అయితే మన రాష్ట్రంలో ఈ ప్రశ్నకు పునర్జన్మలున్నాయి అనే విషయాన్ని మొదటిసారి నిరూపించిన మహిళ శ్రీమతి అలమేలు శ్రీనివాసన్. అదెలాగని ఆశ్చర్యపోతున్నారు కదూ! మరేంలేదు, ఈవిడ తన జన్మని చాలిస్తూ మరి కొందరికి పునర్జన్మనిచ్చారు మరి. అంటే... మన రాష్ట్రంలో ప్రప్రథమంగా జరిగిన అవయవదానం ఈవిడ బ్రెయిన్‌డెత్ అనంతరమే!

2002 జూలై 21వ తేదీన అలమేలు శ్రీనివాసన్‌గారు సికింద్రాబాద్‌లో రోడ్డుమీద నడుచుకుంటూ వస్తున్నారు. ఆవిడ వయసు 41 సంవత్సరాలు ఉంటాయి.

యాక్సిడెంట్ కావడం, ఆవిడ స్పృహ తప్పడం క్షణాల్లో జరిగిపోయింది. ఆవిడని విక్రమపురిలోని అపోలో ఆసుపత్రికి తీసుకువెళ్ళారు.

స్పృహలో లేని ఆవిడ బ్రెయిన్ డెడ్ అన్నారు వైద్యులు. అయితే జూలై 21న యాక్సిడెంట్ కాగా 23న బ్రెయిన్‌డెత్ అని డిక్లేర్ చేశారు.

తన భార్య మరణిస్తోందని తెలిసిన శ్రీనివాసన్ తల్లడిల్లిపోయాడు. అంతా శూన్యంగా అనిపించసాగింది. అంత శూన్యంలోనూ ఆయనలోని మనిషి నిద్రించలేదు! మానవత్వం ఉవ్వెత్తున కెరటంలా లేచింది. ఇప్పుడేం చేసినా భార్యని దక్కించుకోలేడు. ఆ విషయం కచ్చితంగా అర్థమైన అతని మనసులో ఏదో సమయంలో అవయవాలు పూర్తిగా దెబ్బతిని చావుబ్రతుకులమధ్య కొట్టుమిట్టాడుతున్న నిర్భాగ్యులు గుర్తుకొచ్చారు.

ఓ నిర్ణయానికొచ్చాడు, బ్రెయిడ్ డెడ్ అయిన భార్య అవయవాలు పూర్తిగా ఆగిపోకముందే ఆ అవయవాల్ని మరి కొందరికి ఉపయోగించేట్టు దానం చేయాలనుకున్నాడు.

తన నిర్ణయాన్ని వైద్యులకు చెప్పాడు. ఆవిడ కళ్ళు, ఇతర అవయవాల్ని ఆపదలో ఉన్న అనారోగ్య పీడితులకు దానం చేయమన్నాడు.

అంతకుముందు కళ్ళు, మూత్రపిండాలే కాకుండా మిగతా అవయవాలను కూడా దానం చేసే వీలుంది, అలా మరికొందరికి ప్రాణాలని పోయవచ్చునని చాలామందికి తెలియని రోజుల్లోనే శ్రీనివాసన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అంటే అప్పటికే ఆయనకు ఈ విషయాలమీద అవగాహన ఉందన్నమాట. అలా ఆయన ఎందరికో మార్గదర్శకుడయ్యాడు. తన భార్య చిరంజీవి అయ్యేట్టు చూడగలిగాడు. మరణించినప్పటికీ ఆవిడ మరి కొందరిలో తిరిగి జీవించేలా చూశాడు. ఆవిధంగా అలమేలుగారి అవయవాలు పునర్జన్మనిచ్చాయి.

జులై 24వతేదీ ఉదయం రెండు గంటల 30 నిమిషాల ప్రాంతంలో అలమేలు శ్రీసివాసన్‌గారి భౌతికకాయాన్ని పంజగుట్టలోని నిమ్స్‌కి తరలించి, హార్వెస్టింగ్ ప్రారంభించారు. హార్వెస్టింగ్ అంటే మరొకరికి అమర్చేందుకు వీలుగా అవయవాల్ని ఆ శరీరం నుంచి జాగ్రత్తగా తీయడం.

మర్నాడుదయం తొమ్మిది గంటలకల్లా ఆవిడ కళ్ళ కార్నియాలు, మూత్ర పిండాలు వేరే శరీరంలోకి చేరాయి. వాళ్ళకి వెలుగునిచ్చాయి. అలా శ్రీనివాసన్‌గారు మన రాష్ట్రంలో అవయవదానమనే నూతనాధ్యాయానికి ప్రారంభకులయ్యారు.

*



కథ

కారంపూడి వెంకట రామదాస్

పావు

సర్రున పరిగెడుతున్న సియోలాకారు ఒక్కసారిగా కిర్రున ఆగింది. వెనక సీట్లో కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తున్న మోహన్‌రెడ్డి కారెందుకాగింది చెప్మా? అనుకుంటూ గ్లాస్‌లోంచి బయటకి చూశాడు.

పంజగుట్టా క్రాస్ రోడ్.. ఎదురుగా సిగ్నల్ రెడ్ లైట్ చూపిస్తోంది. వాహనాలు వరుసగా ఆగిపోయాయి. వీటిమధ్య బ్రతుకు తెరువుకై వ్యాపారంచేసే చాలామంది అటూయిటూ తిరుగుతున్నారు.

వాహనాలు తుడిచే గుడ్డముక్కలు అమ్మే కుర్రాళ్ళూ, వాహనాల్ని తుడుస్తూ అడుక్కునే కుర్రాళ్ళూ, గాంధీతాత వేషంలో రంగు పులుముకుని తిరుగుతూ ఓ కుర్రాడు...

ఇవేమీ పట్టించుకోకుండా తీవ్రంగా ఆలోచిస్తున్నాడు మోహన్‌రెడ్డి. అతడి మనసు ప్రతీకారంకోసం పథకాన్ని ఆలోచిస్తోంది. ఎంత అవమానం! తనకి రావలసిన కోటి రూపాయల కాంట్రాక్ట్ తన ప్రత్యర్థి శివానాయుడు చివరి నిమిషంలో దేగలా ఎగరేసుకుపోయాడు. అది తలచుకుంటే హృదయం రగిలిపోతోంది.

''సార్! మీరేం ఆలోచిస్తున్నారో నేనూహించగలను. ఆ శివానాయుడు రెండుకోట్ల కాంట్రాక్టు దక్కించుకున్నాడనేగా? మన వ్యాపారంలో ఇవన్నీ మామూలేగా! అయినా యిది జరిగి నెల్లాళ్లైనా మీరింకా దీనిగురించే ఆలోచిస్తున్నారేంటి?" అన్నాడు పక్కనే కూర్చున్న పర్సనల్ సెక్రట్రీ మధుసూధన్.

“అదికాదు మధూ! మనకా కాంట్రాక్టు దక్కకపోవడానికి కారణం.. ఆ శివానాయుడు తెలివిగా మన వ్యక్తిని వాడుకున్నాడు. అందుకే నా గుండె రగిలిపోతోంది..అవును.. మనదగ్గర ఉద్యోగంచేస్తూనే విక్రాంత్‌గాడు శివానాయుడికి ఉప్పందించాడు.. వాడి మూలంగానే ఆ కాంట్రాక్ట్ రాకుండాపోయింది. టెండర్ పేపర్స్ ప్రిపేర్ చేసేది వాడేనని తెలుసుకుని, డబ్బు ఆశచూపి మన కొటేషన్ ఫిగర్ తెలుసుకున్నాడు శివానాయుడు. ఆ సంగతి సమయానికి మనకి తెలీక మోసపోయాం”

“దానికి తగ్గఫలితమే విక్రాంత్ అనుభవించాడు కదా... శివానాయుడు దగ్గర ఉద్యోగం ఊడిందిగా?”

“అవును మరి, శివానాయుడు విక్రాంత్‌ని తన అవసరానికి పావుగా వాడుకున్నాడు. అవసరం తీరాక నమ్మక ద్రోహి అంటూ విక్రాంత్‌ని తన్ని తరిమేశాడు”

“నిజమే... ప్చ్... విక్రాంత్..!” అన్నాడు మధుసూదన్ జాలిగా.

“ఇప్పుడు నేనాలోచించేది రాబోయే ఆ రెండు కోట్ల రూపాయల ‘స్ట్రీట్ లైట్స్’ కాంట్రాక్టు గూర్చే. దాన్ని మనం ఎలాగైనా దక్కించుకోవాలి. అందుకు ఏమైనా చేయాలి. అప్పుడే దెబ్బకి దెబ్బ... అందాక నా కసి తీరదు”

“కానీ శివానాయుడు కాంట్రాక్ట్ విషయంలో ఎవరిమీదా ఆధారపడడు. కొటేషన్ ప్రిపేర్ చేయడం దగ్గర నుండి టెండర్ సబ్మిట్ చేసేవరకు అంతా స్వయంగా చూసుకుంటాడు. ఈ విషయంలో ఎవర్నీ నమ్మడని అందరికీ తెలిసిందే... మరి ఎలా దెబ్బతీద్దామని?” అనుమానంగా అడిగాడు మధుసూదన్.

“అందుకే.. తీవ్రంగా ఆలోచిస్తున్నాను. మార్గం దొరక్కపోదు”

యింకా గ్రీన్ సిగ్నల్ పడలేదు. చేతిలో గుడ్డముక్క పట్టుకుని ఆగిన కార్లని తుడుస్తూ చిల్లరకోసం ప్రాధేయపడుతున్న పన్నెండేళ్ళ కుర్రాడు ఈ కారు దగ్గరికొచ్చాడు. ఆ కుర్రాడు మోహన్‌రెడ్డి కారు తుడుస్తూ జాలిగా డబ్బులడిగాడు. మోహన్‌రెడ్డి ఆ అభ్యర్థిని అస్సలు పట్టించుకునే స్థితిలో లేదు. రెండు, మూడుసార్లు అడిగి ఇక లాభం లేదనుకుని ఆ కుర్రాడు ముందుకు కదిలాడు.

సరిగ్గా అప్పుడే మోహన్‌రెడ్డి కన్ను ఆ కుర్రాడిపై పడింది. మొదట్లో ఏవో ఆలోచనలు లీలగా మెదిలాయి. ఒక్క నిమిషం ఆ ఆలోచనలను ఓ చోట చేర్చి వాటికి పదునుపెట్టాడు. కాసేపట్లో అతడి ప్రయత్నం ఫలించి మెరుపులాంటి ఐడియా రూపుదిద్దుకుంది. వెంటనే అతడి మొహం సంతోషంతో వెలిగిపోయింది.

“ఏయ్...! ఇట్రా...!” అంటూ ఆ కుర్రాణ్ణి కేకేశాడు.

కేక విన్న కుర్రాడు ఆనందంతో మోహన్‌రెడ్డిని సమీపించి “సారూ... ధర్మం చెయ్యండి...” అంటూ మళ్ళీ పాట మొదలుపెట్టాడు.

పర్సునుండి నాణేన్ని తీసి కుర్రాడికి అందించాడు మోహన్‌రెడ్డి. ముందు నిరుత్సాహపడినా అది ఐదు రూపాయల బిళ్ళని గ్రహించి మోహం చాటంత చేశాడు.

“ఆఁ...యింతకీ నీ పేరూ...?” అడిగాడు మోహన్‌రెడ్డి ఏదో మాటవరసకి అడిగినట్టు.

“యాద్గిరండీ...” ఉత్సాహంగా చెప్పాడా కుర్రాడు.

“ఆఁ..హాఁ....” అని ఊరుకున్నాడు మోహన్‌రెడ్డి.

ఇంతలో సిగ్నల్ గ్రీన్ లైట్ చూపడం.... సియోలా ముందుకు దూసుకుపోవడం ఒకేసారి జరిగాయి.

ఈ చిన్ని పరిచయం వాడి జీవితంలో పెద్ద మలుపుకి కారణమని ఊహించలేకపోయాడు.

“సార్! మన కొత్త కాంట్రాక్టు గురించి మీరేమీ ఆలోచిస్తునట్టులేదు” అన్నాడు మధుసూదన్.

“ఆలోచించేదేముంది.. ఈసారి ఆ రెండు కోట్ల టెండర్ మనదే.....” ధీమాగా నవ్వుతూ అన్నాడు మోహన్‌రెడ్డి.

“అదేంటి సార్... కొంపతీసి పంతం కోసం నష్టానికి కోట్ చెయ్యడం లేదు కదా?”

“అదేం లేదు. ఎప్పటికంటే ఎక్కువ ధరకే కోట్ చేస్తున్నాం. అయినా మనకే దక్కుతుంది. ఈసారి శివానాయుడికి ఓటమి ఖాయం”.

తన బాస్ యింత ధీమాగా వున్నాడంటే ఏదో మాస్టర్ ప్లానే వేసుంటాడని అర్థమైంది. అదేంటో ఇప్పుడడిగినా లాభంలేదని ఊరుకున్నాడు మధుసూదన్.

"మధూ! కొత్త టెండర్‌కి సంబంధించిన ఫార్మ్‌కోసం మనం బ్యాంకుకి వెళ్ళాలి బయల్దేరు...." అన్నాడు మోహన్ రెడ్డి.

కారు పంజగుట్టవైపు దూసుకుపోయింది. ఎప్పటిలాగే రెడ్ సిగ్నల్ క్రాస్ రోడ్ వద్ద మోహన్ యాదగిరికోసం ఆతృతగా బయటకి చూశాడు. ఎక్కడా యాదగిరి జాడలేదు. 'ఏమయ్యాడా....?' అనుకుంటుండగా "నమస్తే... సారూ..." అంటూ చేతిలో గుడ్డతో కారును వెనకనుండి తుడుస్తూ కిటికీ దగ్గరికి వచ్చాడు.

పది నోటు అందించాడు మోహన్‌రెడ్డి. యాదగిరి కళ్ళు మెరిశాయి.

"యాద్గిరీ... ఎన్నాళ్ళనుండీ ఈ పని చేస్తున్నావ్..?" ఉబుసుపోకకు అడిగినట్లు అడిగాడు మోహన్‌రెడ్డి.

"అదీ... నాల్లైదు సంవత్సరాలౌతది సారూ..."

"యింతకంటే మంచి పని యిస్తాను చేస్తావా?"

"ఓఁ తప్పక సారూ..."

"అయితే ఈ అడ్రస్‌కొచ్చి నన్ను కలుసుకో..' అంటూ విజిటింగ్ కార్డు అందించాడు మోహన్‌రెడ్డి.

మధుసూదన్ వారిద్దరి దోస్తీ ఈమధ్య గమనిస్తూనే వున్నాడు. అవసరంలేనిదే ఆవగింజంత సహాయం చేయని బాస్.... యిలా ముక్కూమొహం తెలీని ఓ పిల్లాడికి ఉదారంగా పదిచ్చేసి, పైగా వచ్చి కలవమంటున్నాడంటే యిందులో ఏ మర్మముందో భగవంతుడికే తెలియాలి అని మనసులో అనుకున్నాడు.

* * *

"సార్..! మీకోసం యాద్గిరట! మీ కార్డు పట్టుకుని వచ్చాడు. లోపలికి పంపాలా?" అని వాచ్‌మేన్ అడగ్గా పంపమన్నాడు మోహన్‌రెడ్డి.

రెండునిమిషాల్లో వచ్చిన యాదగిరినుద్దేశించి "రా... యాద్గిరీ... యిట్టా వచ్చి కూర్చో..." అన్నాడు.

"దండాలు సార్! గెంత పెద్దిల్లు.... ఏదైన పని యిస్తనన్నరుగద సార్.." కాస్త చనువుగా అన్నాడు యాద్గిరి యిల్లంతా చూస్తూ.

"తప్పకుండా... కాకపోతే నీకో చిన్న పరీక్ష..?"

"పరీచ్చా...?" భయంగా అన్నాడు యాద్గిరి.

"పరీక్షంటే పరీక్ష కాదూ.. కాకపోతే నీకేపాటి ధైర్యం వుంతో తెలుసుకోవాలి"

"ఓ.. నువ్వేంజెప్పిన చేస్తా సారూ.."

"కరెక్టుగా చేస్తే నా వద్ద పరమనెంట్ ఉద్యోగం యిస్తా. ప్రస్తుతానికి యిదుంచుకో..?" అంటూ ఓ వంద కాగితం అందించాడు మోహన్‌రెడ్డి.

వెంటనే మోహన్‌రెడ్డి యాదగిరితో ఏం చెయ్యాలో చెప్పాడు.

ముందు యాద్గిరి బెదిరినట్టు కనబడ్డా తర్వాత మోహన్‌రెడ్డి సులువేనని నమ్మకం కలిగించి, చేతిలో వంద నోటుంచేసరికి సంబరంగా సరేనన్నాడు.

* * *

ఆరోజే టెండర్ సబ్మిట్ చేసేందుకు ఆఖరి రోజు!

మధ్యాహ్నం రెండున్నరకి టెండర్ క్లోజింగ్. పద్ధతి ప్రకారం క్లోజింగైన మరో రెండుగంటలకే టెండర్‌ని అందరి సమక్షంలో ఓపెన్ చేసి అర్హత వున్నదాన్ని ఖరారు చేస్తారు.

సరిగ్గా ఐదుగంటల ప్రాంతంలో మోహన్‌రెడ్డి సెల్ మ్రోగింది.

"సార్! నేను మధుసూధన్ని... గుడ్ న్యూస్ సార్... టెండర్ క్లోజైంది. ఆ టెండర్ మనకే దక్కబోతోంది సార్! ఆశ్చర్యమేమిటంటే శివానాయుడు అసలు టెండర్ వెయ్యడానికే రాలేదు... ఏం చేశారో గానీ... మొత్తానికి మీరు బదులు తీర్చుకున్నారు"

"యస్.... ఐహేవ్ డనిట్..." ఆనందంతో బయటకే ఉత్సాహాన్ని వ్యక్తపరిచి "పని పూర్తికాగానే నువ్వు నా దగ్గరకి రా" అన్నాడు మోహన్‌రెడ్డి.

మరో గంటలో మోహన్ ఎదుటున్నాడు మధు.

"సార్... అద్భుతం... ఇంతకీ ఏం చేశారు? దెబ్బకి శివానాయుడు తోక ముడిచాడు"

"శివానాయుడు టెండర్ వెయ్యడానికి బయల్దేరలేదనుకున్నావా, పిచ్చివాడా...?"

"అంటే... బయల్దేరిన శివానాయుణ్ణి కొంపదీసి దారిలో.."

"ఛా! మన చేతి కెందుకయ్యా మట్టి...? చిన్న ప్లాను, నేననుకున్నట్లు జరిగింది. దాంతో ఈ టెండర్ మనకి దక్కింది"

"అంటే.?"



"జరిగిందేమిటంటే... మోహన్‌రెడ్డి చెప్పుకొచ్చాడు.

* * *

శివానాయుడు తన లక్కీ నెంబర్ ఏపి 29P6833 ఎస్కార్ట్ కారు స్వయంగా డ్రైవ్ చేస్తున్నాడు. వెళ్ళబోతోంది రెండు కోట్ల టెండర్‌కి! అంతా పకడ్బందీగా రెడీ చేసుకున్నాడు. టెండర్ సబ్మిషన్‌కి ఇంకా గంటన్నర టైముంది. ఎంత నెమ్మదిగా పోనిచ్చినా అరగంటకన్నా ఎక్కువ పట్టదు. ముందుగా సబ్మిట్ చేస్తే ఫిగర్ లీకయ్యే అవకాశముంది. అందుకే సమయానికే పని ముగించడం అతడి పాలసీ.

కారు అమీర్‌పేట దాటి పంజాగుట్ట క్రాస్ రోడ్డుకొచ్చింది. ఎదురుగా రెడ్ సిగ్నల్ దర్శనమివ్వడంతో కారు స్లో చేసి ఆపాడు.

ఎప్పట్లాగే విపరీతమైన వాహన రద్దీ!

అక్కడే యాదగిరి చేతిలో గుడ్డతో కార్లను తుడుస్తూ అడుక్కుంటున్నాడు. అయితే ఓ కంట కార్ల నెంబర్లని గమనిస్తూనే వున్నాడు.

'ఏపి29P6833' ఈ నెంబర్ చూడగానే యాదగిరికి అదే తనకి కావలసినకారని గుర్తించాడు.

వెంటనే కారును తుడవడం మొదలుపెట్టాడు.

కాసేపటకి రెడ్ సిగ్నల్ గ్రీన్‌గా మారింది.

యాదగిరి తానేం చేయాలో మనసులో మననం చేసుకున్నాడు.

శివానాయుడు 'తప్పుకో'మంటూ కారుని ముందుకురికించడం – యాదగిరి ఒక్కసారిగా కారు కడ్డంగా కిందపడటం ఒకేసారి జరిగాయి.

క్షణాల్లో అక్కడి వాతావరణం మారిపోయింది.

'ఆక్సిడెంట్...! ఆక్సిడెంట్...! ప్రజల కేకలు!"

జనం శివానాయుడి కారుచుట్టూ మూగారు. కంగారుగా కారు దిగాడు శివానాయుడు. చక్రం కింద రక్తపు మడుగులో యాదగిరి దేహం!

పెద్దమనషులు కొందరు శివానాయుడిపై ఆగ్రహిస్తూ విరుచుకుపడ్డారు. కొందరైతే కొట్టేవరకు వెళ్ళారు. ఎవరో వారించి, కుర్రాణ్ణి నిమ్స్‌లో జాయిన్‌చేసి మరీ కదలమని సలహా యిచ్చారు. అదే సరైనదని అందరూ శివానాయుణ్ణి ఒప్పించారు. కొందరు పెద్ద మనుషులు యాదగిరి దేహాన్ని లేవనెత్తి బలవంతంగా కారులో పడుకోబెట్టి నిమ్స్‌వైపుకి పోనిమ్మన్నారు. శివానాయుడు నిస్సహాయస్థితిలో కారుని నిమ్స్‌కి పోనిచ్చాడు.

* * *

"అర్థమైంది సార్.....! ఆ పై ఏం జరిగిందో నేనూహించగలను. ఆ జనంలో పెద్ద మనుషులు మనవాళ్ళేగా! మనవాళ్ళు శివానాయుణ్ణి మరో రెండు గంటలవరకు నిమ్స్ నుండి బయట పడనిచ్చుండరు" అన్నాడు మధుసూదన్.

మోహన్‌రెడ్డి అవునన్నట్లు నవ్వాడు.

"అది సరే.... యింతకీ యాదగిరి పరిస్థితి...?" అన్నాడు మధుసూదన్.

మోహన్‌రెడ్డి సమాధానమిచ్చేలోగా ఫోన్ మోగింది.

"యాదగిరి చచ్చాడు సార్...!" అటునుండి వినవచ్చిన సారాంశం.

"యాదగిరి చచ్చాడా...?" బయటకే అన్నాడు మోహన్‌రెడ్డి.

విషయం అర్థమైన మధుసూదన్ హతాసుడయ్యాడు.

'ఓ విక్రాంత్, ఓ యాదగిరి లాంటి యింకెందరో అమాయకులు బడా కాంట్రాక్టర్ల ధనదాహక్రీడలో పావులుగా మారుతూనే వుంటారు' అనుకుని నిట్టూర్చాడు మధుసూదన్.

*

మనమూ - మన నమ్మకాలు

రుక్మిణి

దేవుడొస్తాడు

ఆ పిల్లవాడికి పద్నాలుగేళ్ళుంటాయి. మనిషి పీలగా... బాగా అంటకత్తెర వేసిన జుట్టు, సాదాసీదా ప్యాంటు... రంగు వెలిసిన టీ షర్టు - ఇదీ వాడి రూపం! అయితే కాలికో రాగి కడియం, ఛాతీకి రాగి మురుగు, మెడలో తాయెత్తుంది. నుదుటన విబూది బొట్టు. ఆ పిల్లవాడి పేరు సురేష్ అని మా ఆవిడ చెబితే తర్వాత తెలిసింది. అసలు విషయం ఏమిటంటే...

ప్రతి సోమవారం మాకు రెండిళ్ళవతల సుశీలగారిల్లుంది. ఆవిడ భర్త ఏదో ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తాడు. సాధారణంగా వూర్లవెంట తిరుగుతాడు. వాళ్ళకు ఒక కూతురు, ఒక కొడుకు.. అమ్మాయి ఏడు, అబ్బాయి అయిదో తరగతి చదువుతున్నారు. సరే, సోమవారం వచ్చిందంటే ఆ చుట్టుపక్కల ఇళ్ళ మహిళలు సుశీల గారింటికి రావడం ఒకటి రెండుసార్లు గమనించాను. అదీ మధ్యాహ్నం పన్నెండుగంటల తర్వాత- 'ఆఁ ఏముంటుందీ... నారీలోకం గదా... టి.వి.సీరియల్స్.. కొత్త వంటకాల ప్రయోగం... అదీకాకపోతే ఆ దినం 'సభ'కు హాజరుకాని వారిగురించి చెవులు కొరుక్కుని నోరు పారేసుకుంటారులే' అనుకున్నాను.

అయితే హఠాత్తుగా ఒక సోమవారం సురేష్ ఆదరాబాదరాగా సుశీల గారింట్లో సభలో వుండగా నాకు కనిపించాడు. వీడికేం పని? ఆవిడ వీడికి ఏదైనా పని పురమాయించిందా? సరే.... తర్వాత కూడా తరచుగా నాకు సుశీలగారింటి ముందో, గేటు తెరుచుకుని ఇంట్లోకి వెళ్ళడమో గమనించాను.

"ఏంటీ ఆ పోరడు అదే పనిగా సుశీల గారింటి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. ఆవిడ భర్తగారు ఎపుడూ వూర్లు తిరుగుతుంటాడు. వీణ్ణేమైనా పనికి గాని పెట్టుకున్నారా... సామాన్లు కూరగాయలు తేవడానికి" అని మా ఆవిణ్ణి అడిగాను.

వెంటనే నా భార్య చెంపలు వాయించుకుంది.

నేను దిమ్మెర పోయాను.

"విషయం ఏమిటీ?" అని బిత్తరపోతూ అడిగాను.

మా ఆవిడ మెడను ఒంటెలా ముందుకు సాచి నా చెవి దగ్గర తన నోరు ఆనించింది. బహుగోప్యంగా "ఆ పిల్లవాడికి దేవుడొస్తాడు. పాపపు మాటలనకండి!" అని చాలా రహస్యంగా వూదింది.

"నాన్సెన్స్.. దేవుడేంటి? రావడం ఏమిటి? అతనికి మరేం పనుల్లేవా ఏం తిక్కగా వుందా..?"

"అబ్బా... గట్టిగా అనకండి.. ప్రతి సోమవారం అతడి మీదికి దేవుడొస్తాడు. ఆరోజు ఒకరిద్దరికి అన్నీ చెప్తాడు!"

"అన్నీ చెప్పడమేంటీ?" నేను గదమాయించాను.

"అబ్బబ్బ... దేవుడొచ్చినవాళ్ళు మొత్తం చెప్తారు. అన్నీ నిజాలే! అందరూ చెప్పించుకుంటారు. డబ్బులేం తీసుకోడు. అన్నం పెడితే తింటాడు. అయిదో పదో ఇస్తే తీసుకుంటాడు అని మంగళసూత్రాల్ని కళ్ళకద్దుకుంది.

నేనేం మాట్లాడలేదు. అపుడు నా మెదడులో మెరుపు మెరిసింది. మా కంపెనీవాళ్ళు మాకు సోమవారం సెలవిస్తారు. ఆ దినం నాకిష్టమని నాన్‌వెజ్ తెస్తానంటే మా ఆవిడ అయిదారు వారాల నుండీ ఏదో సాకుతో వద్దంటోంది. ఇల్లు మొత్తం కడుగుతోంది. పూజలు సరేసరి!

సోమవారం రానేవచ్చింది. నేను నెమ్మదిగా మా ఇంటి వెనుక సందునుండి సుశీలగారి దొడ్డి గుమ్మం దగ్గరకు పోయాను. సందుగుండా నెమ్మదిగా ముందుగది కిటికీ దగ్గర చేరి లోపల జరుగుతోన్న తంతును గమనించాను.

గది మధ్యలో సురేష్ సన్నని రాగాలు తీస్తూ వూగుతున్నాడు. మా ఎదురింటి రాగిణి దండాలు పెడుతూ ఏదో అడుగుతోంది. సురేష్ సన్నసన్నని కేకలమధ్య ఏదో చెప్తున్నాడు. అన్నీ మనకు తెలిసిన విషయాలే! ఆవిడ ఆరోగ్యం.. భర్త ఉద్యోగం.. పిల్లల చదువు.. అన్నీ రోజూ అందరికీ తెలిసిన విషయాలే! అయితే వాడు వాటిని రాగాలు.. వెక్కిళ్ళు, కేకల మధ్య లయబద్ధంగా వల్లెవేస్తున్నాడు.

నేను చప్పుడు చేయకుండా తిరిగొచ్చి ఇంట్లో కూర్చున్నాను.

కొద్దిసేపటికి మా ఆవిడ వచ్చి "పాపం.. రాగిణికి గాలి సోకిందట- మొండిది ఎనిమిది సోమవారాలు ఉపవాసం చేసి నాగమన్న గుడిలో పడుకోవాల, వేములవాడ పోయి ధర్మగుండంలో మునిగితే గాలి వదిలిపోతుంది. అపుడుగాని వాళ్ళ ఇల్లు బాగుపడదు" అంది.

"ఎవడు చెప్పాడీ సోదంతా?" నేను మామూలుగానే అడిగాను.

"దేవుడొచ్చాడండీ.. అద్సరేగానీ, నేనూ వచ్చేవారం చెప్పించుకుందామనుకుంటున్నాను!" బుంగమూతి పెట్టింది.

"దవడ పేలిపోతుంది. చదువుకున్న దానివి.. నీకిదేం ఆలోచన? అసలు దేవుడు రావడం ఏంటీ... పాపం ఒక్కడు ఇంట్లో, దేశంలో, ఎంతమందిమీదికని వస్తాడు? నేనంతా కనుక్కున్నానులే.. ఆ పిల్లవాడు ఉత్త జులాయి.. ఇంట్లో ఏ పనీ చేయకుండా ఇట్లాంటిదావాటికి అలవాటు పడ్డాడు. ఈ వూర్లోనే ఇంకా వాడికి సుశీల గారిలాంటి మూడు, నాలుగు అడ్డాలున్నాయి. అసలది స్కిజోఫ్రేనియా అనే ఒక మానసిక వ్యాధి కావచ్చు. ఈ జబ్బు ఎనభై శాతంమంది ఆడవాళ్ళలో వుంటుందంటారు"

"అదికాదండీ, వచ్చేవారం సురేష్ దేవుణ్ణి పెళ్ళి చేసుకుంటాడు?"

"చూడూ.. ఇదో ప్రత్యేకమైన జాతి - పిచ్చి ముదిరి జనాన్ని గందరగోళం చేస్తున్నారు. వీళ్ళు జీవితంలో మహిళల్ని పెళ్ళి చేసుకోరు. అర్థంకాలా.. ఆడవాళ్ళ ముచ్చట్లు.. అలంకారాలు.. అన్నీ 'ఆ' కోవకు చెందినవి. అసలు ఇలాంటివాళ్ళు ..." అనిమరీ లోతుగా వివరించబోతే మా ఆవిడ చెవులు మూసుకుంది.

తెప్పరిల్లి "దేవుడి పేరు చెప్పి ఇంత మోసమా... వీడి మొహం మండా?" అని మెటికలు విరిచింది.

*

ఓ మంచి పుస్తకం

నిరుపేద జన జీవిత చిత్రిక 'జంఝావతి' కథలు

మొలకలపల్లి కోటేశ్వరరావు

ఉత్తరాంధ్రలోని నదుల పేరుతో సంకలనాలు వెలువరిస్తూ తెలుగు సాహిత్యాభివృద్ధికి విశేషంగా కృషిచేస్తున్న 'శ్రీకాకుళ సాహితి' వెలువరించిన మరో మంచి కథా హారం 'జంఝావతి కథలు'. ఔత్సాహికుల నుంచీ లబ్ధప్రతిష్టుల వరకూ 21 మంది కథకుల 21 కథల సంకలనమిది.

మన సమాజంలో మరీ వెనుకబడిన గిరిజనులకు సంబంధించి– ఒక ముసలి తాత జీవితాన్ని పరిచయం చేసిన కథ 'ఉరులు'. మైదాన ప్రాంత షావుకార్ల దోపిడీ, పోలీస్ హింస, చివరికి కొడుకు కూడా తండ్రిని పట్టించుకోకుండా విలాస జీవితానికి అలవాటుపడి అప్పులపాలై దొంగగా తిరగడం మల్లిపురం జగదీశ్ కథ ఇది. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని దుర్భర పరిస్థితుల్నీ, హెడ్మాస్టర్ల, వార్డెన్ల ధనదాహాన్నీ, కనీస వైద్య సదుపాయం లభించక ప్రాణాల్ని కోల్పోతున్న యదార్థాల్నీ, అప్త చైతన్య తన 'చెలగాటం' కథలో ఆర్ద్రంగా ఆవిష్కరించారు. గంగపుత్రుడు పైడితాత పెద్దకొడుకు భూలోకుని సముద్రం మింగేస్తుంది. చిన్న కొడుకు మిలటరీకి వెళ్లి సరిహద్దు కాల్పుల్లో బలవుతాడు. ఇక ఆ తల్లిదండ్రుల బాధ 'ఆటు పోటు'. రచయిత చింతాడ తిరుమలరావు.

నిరుపేద వ్యవసాయ రైతుకూలీలకు సంబంధించి – వానల్లేక, పనుల్లేక ప్రజలు అల్లాడిపోతుంటే, వారికి కేటాయించిన పనికి ఆహార పథకం బియ్యం రాజకీయ నాయకుల, దళారుల బొక్కసాలు నింపుతున్నాయి. పొట్టచేత పట్టుకుని వలసలు పోయే కూలీల పిల్లలకి ఇంకేం చదువులూ, వండగలూ? ఈ విషయాన్ని దాసరి రామచంద్రరావు 'మొదళ్ళూ–చిగుళ్ళూ' కథలో చక్కగా, సహజంగా, సజీవంగా అక్షరీకరించారు. కొడుకు అతని భార్యకు చీర తెచ్చిన కారణంగా కనకమ్మ కొడుకునీ, కోడల్నీ ఇంటినుంచి గెంటేసింది. పైకి ఈ కారణం కనిపించినా, "ఆడపిల్లలు, తల్లిదండ్రులు... ఆడికి సంసారసుఖమెక్కడిది అంటూ ప్రశ్నించే కథ 'వేరు పాటు'. రచయిత తయ్యా వెంకటరమణమూర్తి. కొడుకు భూమి అమ్ముతు న్నాడనే వేదనతో ఒక ముసలి తండ్రీ, తన వాళ్లందరూ పోగా మిగిలిన వృద్ధుడూ ఒకేసారి 'అస్తమయం' కావడం కథ. రచయిత జె.వి.రెడ్డిశాస్త్రి. అత్యంత విశ్వాసంగా, నమ్మకంగా పనిచేస్తున్న ఒక పనివాడికి యజమాని సాయంచేసినట్లు నటిస్తూ అతని ఇంటిని ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తాడు. పి.వి.నరసింహారావు 'నీడ' కథ ఇది. సమర్థంగా బిచ్చం ఎత్తుకునే రామలింగం తండ్రి అనారోగ్యం పాలవుతాడు. రాగాలు పాడుతూ రామలింగం వెళ్ళినా టీవీ కార్యక్రమాల్లో లీనమైన ఇల్లాళ్ళ బద్ధకంతో బిచ్చం దొరకదు. 20 రూపాయల బాకీ కారణంగా తన జేగంటని చిన్నం నాయుడు, ఇంకో స్వల్పబాకీ కారణంగా మిషన్ మీది తుండుని సూరపునాయుడు ఎత్తుకుపోతారు. ఈ దశలో ఆత్మహత్య చేసుకుందామన్నా సాధ్యంకాని స్థితిని చింతా అప్పలనాయుడు 'భూతల స్వర్గం' కథలో నిరుపేద జంగం దేవరల దుర్భర దారిద్ర్యాన్ని దయనీయంగా చిత్రీకరించాడు. తిండి పెట్టే భూములు ప్రాజెక్టు కారణంగా ముంపుకు గురయితే వచ్చే కాంపెన్సేషన్‌తో చేసే పథకాలగురించి కలలు కంటూ, ఎదురు చూస్తూ... చివరికి వాళ్లే మునిగిపోవడం గంటేడు గౌరునాయుడు కథ 'ముంపు'.



ఇక ప్రపంచీకరణ నేపథ్యంలో– ఉన్న చారెడు నేలని అమ్ముకుని బిడ్డని చదివిస్తారు ఆ తల్లిదండ్రులు. రాజధానికి వెళ్లిన కొడుకు ఉద్యోగం చేస్తూ నెలకో వందా, రెండొందలూ ఇంటికి పంపిస్తుంటాడు. కొద్దిరోజులుగా ఆ డబ్బూ అందడం లేదు. వృద్ధులైన ఆ తల్లిదండ్రులు కొడుకు పంపించే డబ్బుకోసం ఆశగా, బాధగా ఎదురు చూస్తుంటారు. ప్రపంచీకరణ కారణంగా అక్కడ కొడుక్కే ఉద్యోగం పోయి అవస్థలు పడుతుంటే తల్లిదండ్రులకేం పంపించగలడు? 'పిల్లల కోడి' కథ ఇది. రచయిత రెడ్డిరామకృష్ణ. ప్రైవేటు వాహనాలకు పర్మిట్లిచ్చి ఆర్టీసీ గాలి తీసేయడం, ప్రైవేటు స్కూళ్లను ప్రోత్సహించి సర్కారు బడుల్ని నీరుగార్చడం, బ్యాంకుల్లో వడ్డీలు తగ్గించి బోగస్ బ్యాంకులవైపు ప్రజల్ని నెట్టడం– ఇలా ప్రయివేటు'వల్ల వాటిల్లే నష్టాల్ని జి.ఎస్.చలం 'పొగ' కథలో చిత్రించాడు. లాభాల బాటలో నడుస్తున్న నిజాం సుగర్స్‌ని ప్రైవేటుపరం చేయడంతో అందులో పనిచేసే ఒక ఉద్యోగి వెతల్ని వెల్లడించిన 'వివరణలేని...' ఉపాధ్యాయుల గౌరీశంకరరావు కథ.

పండుగ సంబరం పేరుతో సిరిమాను ఎక్కే ఒక సామాజిక, సాంస్కృతిక దుష్ట సంప్రదాయం, దురాచారం కొన్ని కుటుంబాల్నీ, కొందరు వ్యక్తుల్నీ ఎలా బలి తీసుకుంటున్నదో డాక్టర్.బి.వి.ఎ.రామారావునాయుడు 'సాటింపు' కథలో అద్భుతంగా చిత్రించారు. బాగా వెనుకబడిన ప్రాంతం 'పలాస' నుంచి హైదరాబాద్‌కి కొత్తగా వేసిన రైలు. ఇక్కడ పనుల్లేక హైదరాబాద్ పనులకోసం బయలుదేరిన శ్రామికజనంతో రైలు కిక్కిరిసిపోతోంది. మంత్రి ప్రారంభం. ఆ రైలు గమ్యం చేరకముందే ప్రమాదానికి గురికావడం 'కళింగ ఎక్స్‌ప్రెస్' కథ. రచయిత కొవ్వల భానుమూర్తి.

ఓ మధ్యతరగతి టీచర్ జీవనక్రమంలోని ఎగుడుదిగుడుల్నీ, ఒడుదుడుకుల్నీ 'రెక్క సాగని కథ'లో ఎల్.రమణమూర్తి వివరిస్తే, కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థులు కారాగార వాసాల్నీ, స్త్రీ పీడననీ, స్వేచ్ఛనీ చర్చించిన కథ 'అనగనగా ఒకరోజు...' రచయిత్రి పత్తి సుమతి.

వ్యాపారులమధ్య పోటీ, మార్కెట్లమధ్య పోటీ, చివరికి వలస వచ్చిన దొరల ధాటికి పెద్దచేపలు సైతం ఎలా గిలగిలలాడిపోతాయో, మన భూముల్నీ, నీటినీ ఎలా మింగేస్తున్నాయో అట్టాడ అప్పల నాయుడు 'షా...' కథలో చిత్రించారు.

ఒకవైపు వేలాదిమంది ఆకలితో మరణిస్తూ ఎముకలపోగుల గుట్టలు పడుతుంటే మరోవైపు ఆ ఎముకలతోనే ఫ్యాక్టరీలు నెలకొల్పుతూ విలాసవంతమైన జీవితాల్ని గడుపుతున్న ధనికస్వామ్యం – పి. కమలకుమారి 'భస్మ సింహాసనం' కథ. సమాజం 'బందెల దొడ్డి' లాంటిదనీ, దాన్ని బద్దలుకొట్టాలనీ కె.వి.కూర్మనాథ్ మూగజీవులద్వారా చెప్పిస్తారు. ఈ రెండు కథలూ మాంత్రికవాద ధోరణిలో వచ్చినవి.

నెమ్మదస్తుడూ, మృదుస్వభావీ అయిన ఒక సహకారసంఘ కార్యదర్శి వ్యక్తిత్వంతోపాటు ఆ సంఘాల్లోని లోపాల్నీ, లొసుగుల్నీ, కొందరు కార్యదర్శుల లంచగొండితనాన్నీ మొత్తం సహకార వ్యవస్థ, సమాజ పోకడల్ని గూర్చి విస్తృతంగా చర్చించిన కథ 'చేదుఫలం'. రచయిత పడాల జోగారావు.

సుదీర్ఘ విరామానంతరం కారా శ్రీకాకుళ సాహితి ప్రోద్బలంతో రాసిన కథ 'అన్నెమ్మ నాయురాలు'. స్వాతంత్ర్యానంతరం వ్యవసాయ గ్రామీణ భారతంలో వచ్చిన మార్పుల్ని ఈ కథ చర్చిస్తుంది.

మన సమాజంలో సమస్త రంగాల ప్రజల వేదనాగాథల్ని కథలుగా మలిచిన మంచి కథల సంకలనమిది. బాగా వెనుకబడిన జిల్లానించి ఇలా వరుసగా సంకలనాలు తీసుకొస్తున్న శ్రీకాకుళ సాహితీ ప్రయత్నాన్ని సాహిత్యాభిమానులందరూ హృదయపూర్వకంగా హర్షించాల్సిందే! *

గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్

హిప్నో కమలాకర్

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్,
ఫోన్: 9849130141

నా వయసు 21 సంవత్సరాలు. కొన్ని నెలల క్రితం మా దగ్గరివాళ్ళు చనిపోయారు. అప్పట్నుంచీ నాలో ఈ చావు భయం నా మనసులో పేరుకుపోయింది. ఏది చూసినా, ఏం చేసినా ఈ చావు అనే సమస్యే కనబడుతోంది. రకరకాల ఒత్తిళ్ళు, భ్రమలు నన్ను వెంటాడుతున్నాయి. ఒక్కొక్కసారి చావేమిటి, బ్రతుకేమిటి, ఎందుకు పని చేయడం? అసలీ భూమి, జనం, నీరు, ఆకాశం ఇవన్నీ ఎలా వచ్చాయనే సందేహాలు కలుగుతున్నాయి. అలాగే రకరకాల భ్రమలు కలగడం, ఎవరన్నా ఏదైనా చెబితే నమ్మడం - ఇలాంటివి నా మనసులో ఊహలరూపంలో కనబడుతున్నాయి. సైకియాట్రిస్ట్‌ను కలిశాను. అతను మందులు రాశారు. అయినా ఈ భ్రమల్లోంచి బయటకు రాలేకపోతున్నాను. దయచేసి నా సమస్యకు సలహా ఇవ్వగలరని కోరుతున్నాను.

రమ్య, నల్గొండ.

మీ దగ్గరివాళ్లు చనిపోవడం మూలంగా మాత్రమే భయం ఏర్పడి ఉంటే మీ స్వీయ ప్రయత్నంతో గాని, లేదా సైకాలజిస్టు దగ్గర గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ తీసుకోవడం ద్వారా పూర్తిగా బయటపడవచ్చు. చావు అనేది ఒక సహజ ప్రక్రియ. ప్రతి వ్యక్తి జీవితంలో అది తప్పని పరిస్థితి. వయసు మళ్ళటం, అనారోగ్యం కారణాల వలన, ప్రమాదాల వలన మరణం సంభవిస్తూనే ఉంటుంది. ఎప్పుడో ఏదో అవుతుందని ప్రస్తుత జీవితాన్ని ఒత్తిడికి గురిచేసుకోవడం సరికాదు. నిన్నటివరకు గడిపిన జీవితాన్ని సమీక్షించుకుని నేడు చేయాల్సిన పనులను, బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి. అలా చేస్తే రేపు ఎటువంటి పరిస్థితులు ఎదురైనా తట్టుకుని జీవితంలోని మాధుర్యాన్ని అనుభవించగలుగుతారు. మీ బంధువు చావును మీతోబాటు అందరూ చూశారు. వారికి రాని భయం మీకు ఎందుకు కలిగింది?! ఇలా తార్కికంగా ఆలోచిస్తే భయం నీవు సృష్టించుకున్నదే అని నీకు అర్థమౌతుంది. అయితే భ్రమలు, భ్రాంతులు తీవ్రస్థాయిలో ఉంటే 'సైకోసిస్' తరహాకు చెందిన ఒక తీవ్రమైన మానసిక రుగ్మత ప్రారంభమయిందని అర్థం. అటువంటి పరిస్థితుల్లో సైకియాట్రిస్టు పర్యవేక్షణలో కొన్ని నెలల నుండి సంవత్సరాల దాకా మందులు వాడటం తప్పనిసరి అవుతుంది.

సార్ నేను ఇంటర్ వరకు తెలుగు మీడియం చదివి, డిగ్రీలో అందరూ ఇంగ్లీష్ మీడియం తీసుకున్నారని నేను కూడా తీసుకున్నాను. కాని ఏమీ అర్థంకాక ఫస్ట్ ఇయర్‌లో నాలుగు సబ్జెక్టులు మిగిలి ఉన్నాయి. వీటినెలా పూర్తిచేయాలో తెలియడం లేదు. చచ్చిపోవాలని ఉంది. నాకు ఆలోచనలు ఎక్కువగా వస్తాయి. కూర్చున్నా, నిలబడినా, ఏం చేసినా నాకు తెలియకుండానే రకరకాల ఆలోచనలు వస్తాయి. అసలు ఏకాగ్రత కుదరడంలేదు. నేను ఏదీ సాధించలేకపోతున్నాను. ఒంటరిగా తిరుగుతూంటాను. దేనిమీదా కూడా ఇష్టాన్ని కలిగించుకోలేకపోతున్నాను. అసలు దేనిమీదైనా ఇష్టాన్ని ఎలా ఏర్పరచుకోవాలి? నా జీవితం అంతాకూడా శూన్యంగా ఉంది. ఏదైనా మంచి సలహాను అందివ్వగలరు.

సత్తి, నర్సరావుపేట.

గ్రామీణ ప్రాంతాల్లో, సామాన్య కుటుంబాలలో పుట్టి ప్రస్తుతం ఉన్నత చదువులు చదువుతున్నవాళ్ళందరూ ఇంటర్, డిగ్రీ స్థాయి వరకు తెలుగు మీడియం చదివినవారే. నేను కూడా అంతే. తెలుగుమీడియం నుంచి ఇంగ్లీషు మీడియంకు మారటంవలన కొన్ని నెలలనుండి సంవత్సరాల వరకూ కొన్ని ఇబ్బందులు ఏర్పడుతూనే ఉంటాయి. అవి కేవలం తాత్కాలికమైనవే తప్ప శాశ్వతమైన అడ్డుగోడలు మాత్రం కాదు. మీది భాషా సమస్యే తప్ప విజ్ఞానానికి సంబంధించిన సమస్య కాదు. ఇప్పటికే మీరు ఎంతో నేర్చుకుని ఉన్నారు. భాషా సమస్యను అధిగమించాలనుకుంటే అది మీకు అసాధ్యం ఏమీ కాదు. ప్రతిరోజూ ఇంగ్లీషు పేపరు చదవండి. రోజుకు కనీసం 5 కొత్త పదాలను నేర్చుకోండి. నేర్చుకున్న పదాలతో వాక్యాలను రూపొందించండి. 3 నుండి 6 నెలల్లో మీరు భాషా సమస్యను అధిగమించగలుగుతారు. మీరు లేఖలో రాసిన ఇతర విషయాలను పరిశీలిస్తే మీలో 'న్యూరోటిక్ డిప్రెషన్' ఉందని అర్థమౌతోంది. మంచి సైకాలజిస్టు దగ్గర గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ తీసుకుంటే ఆ సమస్యను అధిగమించ గలుగుతారు.

నా వయస్సు 19 సంవత్సరాలు. నేను బి.ఎ. సెకండ్ ఇయర్ చదువుతున్నాను. మొదటి సంవత్సరంలో బాగానే చదివి ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయ్యాను. కాని సెకండ్ ఇయర్‌కి వచ్చేసరికి ఒక అమ్మాయిని గాఢంగా ప్రేమించాను. కానీ ఆ అమ్మాయి నా నుండి దూరంగా వెళ్ళిపోయింది. అందుకని ఆ అమ్మాయిని మరువలేకపోయాను. తర్వాత ఆమెని మర్చిపోయి ఇంకో అమ్మాయిని ప్రేమించాను. తను కూడా నో చెప్పింది. దీంతో ఆ అమ్మాయిని కూడా వదిలేశాను. ఇపుడు నా సమస్య ఏమిటంటే కనిపిస్తున్న ప్రతి అందమైన అమ్మాయినీ ప్రేమించాలి అనిపిస్తోంది. దీని వలన సెకండ్ ఇయర్‌లో బాగా చదవలేకపోతున్నాను. ఇంకో సమస్య ఏమిటంటే నేను 168 సెం.మీ. పొడవుంటాను. బరువు 46 కేజీలు ఉంటాను. నా ఫ్రెండ్స్ అందరూ 'నువు చాలా సన్నగా ఉన్నావు' అని ఎగతాళి చేస్తారు. నేను దాని వలన కూడా చాలా కుంగిపోతున్నాను. నేను లావుగా తయారావాలంటే ఏం చేయాలి? నా వయసుకు నేనున్న పొడవు, బరువు సరిపోతుందా? నాకు అమ్మాయిలు కలలోకి రావడం వలన వారానికి రెండుసార్లు అయినా నా వీర్యం పోతోంది. దీనివలన నేను సన్నగా అయిపోతున్నానని కొందరు అంటున్నారు. నా సమస్యకు పరిష్కారం తెలుపగలరు.

శ్రీనివాస్, ఒంగోలు.

ప్రేమ ఒక ఉద్వేగం. అది సరైన మోతాదులో ఉన్నపుడు ప్రేమ ఫలాలను ఆస్వాదించగలుగుతావు. నీవు అందాన్ని చూస్తున్నావేగాని, అమ్మాయిల మనసులను కాదు. అందుకే ఒకరు కాదంటే మరొకరివైపు వెళ్ళిపోతున్నావు. నీలాంటి చంచల మనస్కుడిని ఏ అమ్మాయీ ఇష్టపడదు. దానికి కారణం నీలో మానసిక పరిపక్వత సరిగా లేకపోవడమే. చంచలమైన మనస్సు, అస్థిరమైన ఆలోచనలు, అభిప్రాయాలు ఉన్నవాళ్ళందరూ ఏ రంగంలోనూ అభివృద్ధిచెందలేరు. కోరుకున్న ఫలితాలను సాధించలేరు. నువ్వు చదువులో వెనుకపడిపోవటానికి కారణం కూడా ఇదే. కెరీర్‌ట్రాక్‌లో ఉన్నపుడు చదువుకి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రేమ వంటి ఉద్వేగాలు ఆ కెరీర్‌ట్రాక్‌లో ముందుకెళ్లటానికి ప్రోత్సాహకరంగా ఉండాలేగాని అడ్డుగోడలుగా మారకూడదు. ఇక నీ ఎత్తు, లావు విషయాలకు వస్తే ఒక మంచి క్వాలిఫైడ్ డాక్టర్‌ని కలిసి నీ సమస్యను వివరించు. అవకాశం ఉంటే వైద్యపరంగా దానికి పరిష్కారమార్గాన్ని చూపిస్తారు. నిద్రలో కలలుగనే సమయంలో వీర్యస్ఖలనం కావటం మూలంగా నువ్వు సన్నగా అయిపోతున్నావనేది ఏమాత్రం నిజం కాదు. అది కేవలం ఒక అపోహ మాత్రమే.



అవీ... ఇవీ

తాతయ్య కనిపించాడా?

ఎనభయ్యేళ్ళ వృద్ధురాలు కనకమ్మ చనిపోగానే శివకింకరులొచ్చి స్వర్గానికి తీసికెళ్ళారు. అక్కడో అందమైన యువతికేసి కళ్ళార్పకుండా చూస్తోంటే "నమస్తే బామ్మా.. నా పేరు ఊర్వశి. ఇప్పుడే ఇంత అందంగా వున్నావు, వయసులో వున్నప్పుడు ఇంకెంత అందంగా వున్నావో" అంటూ అభినందిస్తున్నట్లుగా మాట్లాడింది. తర్వాత తనతోబాటు స్టెప్పులూ వేయించింది. ఇక అక్కడి రాజభోగాలకు అంతూదరీ లేకపోయింది. ఏ పదార్థం తిన్నా అమృతతుల్యంగా వుంది. ఎక్కడ కూర్చున్నా వీనులవిందుచేసే సంగీతం వినిపిస్తోంది. ఇప్పుడు నడుంనొప్పి, మోకాళ్ళనొప్పులంటే ఏమిటో తెలీదనిపిస్తోంది. అందరూ నవ్వుతూతుళ్ళుతూ మాట్లాడుతోంటే ఆవిడకెంతో ఉత్సాహంగావుంది. అలా చాలాసేపు సరదాగా గడిచాక పచ్చటి చెట్టుకింద మేనువాల్చగానే నిద్రపట్టింది.

"ఏంటి బామ్మా, ఏడైనా లేవలేదు. పైగా కలలు కంటున్నట్లున్నావ్?" అని మనవడు తట్టిలేపడంతో కనకమ్మ నీరసంగా తల విదుల్చుకుంటూ లేచి "త్వరగా చచ్చిపోతే బాగుండునురా, అబ్బా స్వర్గం ఎంత బాగుందనుకున్నావు?! ఈ ముసలి అవస్థలేవీ అక్కడలేవు" అంది.

"ఇంతకీ తాతయ్యక్కడ కనిపించాడా బామ్మా?"

"పోరా మనవడా, కలలు కూడా కమ్మగా వుండొద్దంటావా?'' అంటూ మోకాళ్ళు నొక్కుకోసాగిందావిడ.

- ఎన్నార్

ప్చ్...

ఒక శాకాహారి, ఓ మాంసాహారి మాట్లాడుకుంటున్నారు.

<u>మాంసా:</u> నువ్వసలు నాన్‌వెజ్ ఎందుకు తినవు?
<u>శాకా:</u> ఏమో, నాకిష్టంలేదు
<u>మాంసా:</u> ఒకసారి తినిచూడు, మళ్ళీ జన్మలో వదిలిపెట్టవు
<u>శాకా:</u> ఛఛ, మాటవరసక్కూడా అలా అనకు
<u>మాంసా:</u> నాకైతే వెజిటేరియన్ తిండి గడ్డితో సమానం అన్పిస్తుంది. నామాట విని చికెన్ తినిచూడు
<u>శాకా:</u> అబ్బే అలా అనకు. నాన్‌వెజ్‌గురించిన మాటలు కూడా నే వినలేను
<u>మాంసా:</u> తినలేదు గనుక అలా అనగల్గావు
<u>శాకా:</u> అసలా వాసన్లే నాకు పడవు. అదంటే ఎంత అయిష్టమో చెప్పనా... లక్ష రూపాయలిచ్చినా ఒక గ్రాము కూడా తినలేను
<u>మాంసా:</u> ప్చ్... లక్షిచ్చి నీతో తినిపించాల్సిన అవసరం ఎవరికుందిలే.. పైగా అదేం కూరగాయల్లా చవగ్గా వచ్చేది కూడా కాదు, తినకపోతే మాకే మిగుల్తుంది అనుకుంటాం..

వి. పుష్పలీల



కొత్త పుస్తకాలు

భావ తీవ్రతకు తోడైన కవితా సౌందర్యం

దూడం మనోహర్ ఉపాధ్యాయుడు. కవి ఉపాధ్యాయుడైతే మరింత సామాజికబాధ్యతను గుర్తెరుగుతారేమో అన్పించింది 'ఒక వీడ్కోలు' చదివినప్పుడు. ఆయా అంశాలపట్ల కవి స్పందించిన తీరు, తీవ్రత పాఠకుణ్ణి గాఢంగా హత్తుకుంటుంది. ప్రతీ కవితలోంచి కవి లేచి పాఠకులను ప్రశ్నిస్తున్నట్టు అన్పిస్తుంది. సాదాసీదాగా రాసిన కవితలు ఎక్కడా ఈ పుస్తకంలో మనకి దొరకవు. కవితలన్నీ కూడా విషయంతో మమేకమై రాసినదే. అందుకే అన్నీ గాఢత సంతరించుకుని కదిలించే కవితలయ్యాయి.

గాఢత, నిబద్ధత, సంక్షిప్తత ఈయన కవితల్లో మనల్ని ఆకర్షించే గుణాలు. అన్నీ భావావేశం వున్న కవితలని, కవి గట్టివాడేనని కవితలు చదివాక స్పష్టమౌతుంది. ఓ కవితలో 'అమ్మేదుస్తోంది/నాకింకా సూదిమందు/ఈయనే లేదు' అంటాడు. తల్లులు బాల్యంలో పిల్లలకి సూదిమందు ఇప్పించడం మామూలే. పిల్లలకి సూదిమందు ఇప్పించేటప్పుడు పిల్లలతోబాటు తల్లులూ ఏడుస్తారు. అయితే పిల్లవాడికన్నా ముందే తల్లి ఏడవడాన్ని కవిత్వీకరించిన తీరు తల్లీబిడ్డల బాంధవ్యాన్ని, తల్లి మహోన్నత ప్రేమని కవి వ్యక్తీకరించిన తీరు ప్రశంసనీయం. కొన్ని కవితల్లో తెలంగాణా మాండలీకపు సొంపును ప్రదర్శించారు. 'ఎగుడుదిగుడుతనం' మీద ఎప్పటికప్పుడు జగడమై లేచినా/ తడవ తడవకూ 'బలుపు' మీద గెలుపుకై 'గొడవ' చేసినా/కోళోజీవే/తెలంగాణా కలేజావే/విసిరిన తెలుగోడి పంజావే!!' అంటూ కవి కాళోజి గురించి 'నువ్వు నువ్వే' శీర్షికతో రాశారు. ఈ పుస్తకానికి ముందు మాట రాసిన ప్రముఖ సాహితీవేత్త నలిమెల భాస్కర్‌గారు కవితల్లోని మాండలీకపు సౌందర్యాన్ని ప్రస్తావిస్తూ కవి ప్రతిభను ప్రశంసించారు. కొత్తతరం కేవలం పాశ్చాత్య వేష భాషలలో కొట్టుకుపోతుందని వేదన చెందేవారికి ఉపాధ్యాయుడిగా స్థిరపడి కూడా బాధ్యతాయుతంగా సామాజిక మార్పును ఆకాంక్షిస్తూ కవిత్వంద్వారా కృషిచేస్తున్న దూడం మనోహర్ లాంటి వారిని చూసినప్పుడు ఒక నిప్పురవ్వ చాలు వెలుగును పండించడానికి అన్పించి ఆనందం కలుగుతుంది. ఇది మంచి కవితా సంకలనం. కవి మరిన్ని కవితలు పండించాలని ఆశిద్దాం.

ఒక వీడ్కోలు కవితా సంపుటి, దూడం మనోహర్ వెల: రూ. 40/-, పేజీలు 81 ప్రతులకు: 12-8-26, ప్రగతి నగర్, సిరిసిల్లా-505301, కరీంనగర్, ఇంకా అన్ని ప్రముఖ పుస్తకాల షాపుల్లో

- వీరప్రసాద్

క్రీడారంగంలో ప్రతిభా మూర్తులు

గులు ఎజీకీల్

వెల : 50/-, పేజీలు : 131

ప్రతులకు :

అలకనంద ప్రచురణలు

మేరిస్ స్టెల్లా కాలేజి ఎదురుగా,

విజయవాడ - 520 008

సమయమూ-సందర్భమూ సాహిత్యవ్యాసాలు

సింగమనేని నారాయణ

వెల : 50/-,

పేజీలు : 132

ప్రతులకు :

విశాలాంధ్ర,

ప్రజాశక్తి బుక్‌హౌస్‌లలో ...

ఆనవాలు

సాహిత్యంలో వస్తోన్న కొత్త పుస్తకాలను, సరికొత్త ధోరణులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తున్న వి. రాజాహుస్సేన్ విశ్లేషణాత్మకంగా, సూటిగా, క్లుప్తంగా చేసిన పరిచయాలే ఈ సాహితీవ్యాసాల సంకలనంగా తయారయింది.

అలుపెరుగని పరిశోధకుడు ఆరుద్ర అని నిరూపిస్తూనే, ఆరుద్ర రాసిన అరబ్బీ మురబ్బాలను, కూనలమ్మ పదాల గొప్పదనాన్ని, దాని నేపథ్యాన్ని జూలూరి , నెల్లూరి వేమన శివారెడ్డిల కవిత్వాన్ని వారి గొప్పదనాన్ని కొన్ని వాదవివాదాల గురించి, ముస్లిం వాదం గురించి రాసిన వ్యాసాలు కొన్ని ఆసక్తికరమైన అంశాలను తెలియజేస్తాయి. వంశీ రాసిన చిన్న కథపై చేసిన విశ్లేషణ అద్భుతం. ఇది కథా సాహిత్యవిమర్శలోనే కొత్త ప్రయోగం. తర్వాత కొన్ని కవితా సంకలనాల సమీక్షలు కూడా ఇందులో చోటు చేసుకున్నాయి. ఆయా సంకలనాల గుణదోషాలను వివరించడంలో, లబ్ద ప్రతిష్ఠులు అని కూడా చూడకుండా నిష్పక్షపాతంగా, నిజాయితీగా చేసిన విమర్శలు వారు ఆత్మవిమర్శ చేసుకోవడానికి తోడ్పడతాయి. విమర్శకుడి విలువను పెంచుతాయి.



- కె.పి. అశోక్ కుమార్

('ఆనవాలు' (సాహిత్యవ్యాసాలు) వి. రాజా హుస్సేన్, చుక్కారామయ్య విద్యాపీఠం, హైదరాబాద్ / కోదాడ, వెల: 90/-, పేజీలు: 196, ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో లభించును)

రుచి

బాదం హల్వా

కావలసిన పదార్థాలు

బాదం పప్పు	-	ఒక కప్పు
పంచదార	-	రెండు కప్పులు
నెయ్యి	-	ఒక కప్పు
ఎస్సెన్స్	-	అరస్పూన్

తయారుచేసే పద్ధతి

బాదంపప్పును నీటిలో నానబెట్టుకుని, పై పొట్టు తీసేసి, మిక్సీలో వేసి మెత్తగా పేస్ట్ చేసుకోవాలి. ఓ గిన్నెలో పంచదార, కొద్దిగా నీరు పోసి తీగపాకం పట్టుకోవాలి. అందులో బాదం పేస్ట్ వేసి బాగా కలియబెట్టి కొంచెం నెయ్యి వేస్తూ దగ్గరగా అయ్యేవరకు ఉడికించాలి. దించేముందు ఎసెన్స్ వేసి దించుకోవాలి. ఒక పళ్ళానికి నెయ్యిరాసి అందులో పోసి సమంగా సర్దాలి. చల్లారిన తర్వాత ముక్కలు కోసుకోవాలి. కావాలనుకుంటే జీడిపప్పు, కిస్‌మిస్ నేతిలో వేయించి పైన అద్దితే తినడానికి మరింత రుచిగా ఉంటుంది.

- జ్యోతి

బటర్‌నాన్

కావలసిన పదార్థాలు

మైదాపిండి	-	నాలుగు కప్పులు
వెన్న	-	పావుకప్పు
పెరుగు	-	పావుకప్పు
పాలు	-	ఒక కప్పు
పంచదార	-	స్పూన్
ఉప్పు	-	అరస్పూన్
నెయ్యి	-	పావుకప్పు

తయారుచేసే పద్ధతి

ముందుగా మైదాను ఒక గెన్నెలోకి తీసుకుని దీనిలో పైన చెప్పినవన్నీ వేసి అవసరం అనుకుంటే కొద్దిగా నీళ్లుచల్లి పూరీ పిండిలా కలుపుకుని ఓ అరగంట మూత పెట్టి పక్కనుంచాలి. తర్వాత చిన్న చిన్న ముద్ద లుగా తీసుకుని చపాతీలా వత్తి దానిపై నెయ్యిపూసి రోల్‌లా చేసి మళ్ళీ ముద్దగా చేసి మందంగా చపాతీ చెయ్యాలి. పెనంమీద వీటిని వేసి కొంచెం వెన్నరాసి కాల్చుకుంటే బటర్ నాన్ సిద్ధమౌతుంది. వెజిటబుల్ కుర్మాతో వేడిగా తింటే చాలా బావుంటాయి.

కలంస్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్: కలం స్నేహం, **బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.**

పేరు : తేజావత్ హరిత
వయసు : 11 సం॥
చదువు: 7వ తరగతి
లక్ష్యం: కలెక్టర్ అవడం
హాబీలు: కథలు చదవడం, పాటలు పాడడం, బొమ్మలు వేయడం, టీవీ చూడడం.
చిరునామా : టి.హరిత, డాటరాఫ్ బాలు (టీచర్), హౌస్ నం:19-1-120/ఎ, రాజుపేట కాలనీ, భద్రాచలం. 507 112.

పేరు : బత్తిని శ్రీనివాస్‌గౌడ్
వయసు : 17 సం॥
చదువు: 10వ తరగతి
స్కూలు: జడ్.పి.హెచ్ స్కూల్
లక్ష్యం: డాక్టర్ అవడం
హాబీలు: బొమ్మలు వేయడం, టీవీ చూడడం.
చిరునామా: బి.శ్రీనివాస్‌గౌడ్, సన్నాఫ్ బుచ్చన్న, మాదాపూర్, కోరుట్ల (మం), కరీంనగర్ జిల్లా. 505 330.

పేరు : కె.సురేందర్
వయసు : 11 సం॥
చదువు: 6వ తరగతి
స్కూలు: క్రాంతి విద్యామందిర్
లక్ష్యం: క్రికెటర్ అవడం
హాబీలు: క్రికెట్, చెస్ ఆడడం, ప్రజాశక్తి చదవడం
చిరునామా : కె.సురేందర్, సన్నాఫ్ బాబు, పాలేరు (గ్రా), కుసుమంచి (మం), ఖమ్మం జిల్లా.

పేరు : చింతిరాల సమత
వయసు : 7 సం॥
చదువు: 2వ తరగతి
స్కూలు: ది డాన్ బాస్కో నర్సరీ స్కూల్
లక్ష్యం: టీచర్ అవడం
హాబీలు: చదవడం, టీవీ చూడడం
చిరునామా: సిహెచ్.సమత, డాటరాఫ్ సుందరరావు, కేరాఫ్ బి.భిక్షాలు, డోర్ నం: 41-29-47, రాణీగారితోట, చలసాని నగర్, విజయవాడ-13.

పేరు : టి.హేమ
వయసు : 12 సం॥
చదువు: 7వ తరగతి
స్కూలు: ఎ.పి.ఎస్. డబ్ల్యు.ఆర్.ఇ స్కూల్
హాబీలు: పుస్తకాలు చదవడం
చిరునామా : టి.హేమ, డాటరాఫ్ మునెప్ప, ఎ.పి.ఎస్.డబ్ల్యు.ఆర్.ఇ స్కూల్, మదనపల్లి, చిత్తూరు జిల్లా.

పేరు : ఎల్.నిరంజన్
వయసు : 16 సం॥
చదువు: 10వ తరగతి
స్కూలు: జడ్.పి.హెచ్ స్కూల్
లక్ష్యం: ఇంజనీర్ అవడం
హాబీలు: క్రికెట్, చెస్, క్యారమ్స్ ఆడడం, పేపర్ చదవడం.
చిరునామా: ఎల్.నిరంజన్, సన్నాఫ్ రామచంద్రయ్య, నర్కూడ, శంషాబాద్ (మం), రంగారెడ్డి జిల్లా.